**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 55, పేజీలు - 08

శుక్రవారం, ఆగష్టు 21, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# మార్గదర్శి వ్యవహారంలో ఉండవల్లి పిటిషన్ డిస్మిస్



- మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అనుకూలంగా సుప్రీం కోర్టు కీలక తీర్పు
- తెలంగాణ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంలో ఉండవల్లి పిటిషన్ దాఖలు
- పిటిషన్ దాఖలు చేసే అధికారం, అర్హతపై ఉండవల్లిని ప్రశ్నించిన ధర్మాసనం
- కేసు వ్యవహారం వ్యక్తిగత వివాదంగా కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్య
- మార్గదర్శి తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, నాగముత్తు వాదనలు



గౌటీ రామ కృష్ణ
9394334646,
ప్రజాప్రశ్న ప్రత్యేకం

Margadarsi CHIT FUND PRIVATE LIMITED



మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై దాదాపు రెండు దశాబ్దాలుగా నడుస్తున్న వివాదానికి సుప్రీంకోర్టు ముగింపు పలికింది. మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. అసలు ఈ పిటిషన్ దాఖలు చేయడానికి మీరెవరు అంటూ ఉండవల్లిని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది.

సంస్థతో ఆయనకున్న వ్యక్తిగత వివాదం మాత్రమే ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఆయన ఎంత ఎక్కువగా వాదిస్తే ఆయనపై అంతగా అనుమానాలు పెరుగుతాయని ధర్మాసనం స్పష్టం చేసింది. కేవలం సంస్థను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఆయన ఇన్నాళ్లుగా ఈ న్యాయపోరాటం చేస్తున్నారని కోర్టు పరోక్షంగా అభిప్రాయపడింది. డిపాజిటర్లకు అన్యాయం జరగనప్పుడు ఇందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెబుతూ ఉండవల్లి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను పూర్తిగా కొట్టివేసింది.

## డిపాజిటర్లందరికీ డబ్బుల చెల్లింపు

మార్గదర్శి ఫైనాన్సియర్స్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నాగముత్తు తమ వాదనలు వినిపించారు. ఇప్పటివరకు డిపాజిటర్లకు రూ. 2,591 కోట్లు తిరిగి చెల్లించినట్లు వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చినట్లు ఈటీవీభారత్ కథనం పేర్కొంది. ఇంకా ఎవరైనా క్లెయిమ్ చేయని వారు ఉంటే వారి కోసం మిగిలిన రూ. 5.43 కోట్లను ఒక ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో భద్రపరిచినట్లు న్యాయమూర్తులకు వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే హైకోర్టు నడుచుకుందని, పత్రికల్లో బహిరంగ ప్రకటన ఇచ్చినా ఏ ఒక్క డిపాజిటరూ ఫిర్యాదుతో ముందుకు రాలేదని మార్గదర్శి లాయర్లు స్పష్టం చేశారు.

## హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం

మార్గదర్శి సంస్థ హెచ్‌యుఎఫ్ కింద ఉంటూ కూడా రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందని ఆరోపిస్తూ 2008లో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో క్రిమినల్ కేసు నమోదైంది. అయితే డిపాజిట్ దారులకు డబ్బులు తిరిగి ఇచ్చేసినందున ఆ ప్రొసీడింగ్స్ నిరర్థకమని తెలంగాణ హైకోర్టు గతంలో స్పష్టం చేసింది. మార్గదర్శి మాజీ కర్త శ్రీ రామోజీరావు జూన్ 2024లో కన్నుమూశారని, అందువల్ల హెచ్‌యుఎఫ్ లోని మిగతా సభ్యులను నిందితులుగా చేర్చలేమని కూడా కోర్టుకి సంస్థ తెలిపింది.

## వివాదానికి శాశ్వత ముగింపు

దీంతో పాటు తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 2024లో పబ్లిక్ నోటీసు జారీ చేసి అభ్యంతరాలు కోరినా ఎవరూ రాకపోవడంతో మార్గదర్శిపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. రామోజీరావు మరణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని అభియోగాలను రద్దు చేసింది. హైకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా తేల్చిచెప్పింది. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ఉండవల్లి అరుణ్ కుమార్ అప్పీలును డిస్మిస్ చేస్తూ ఈ న్యాయ వివాదానికి శాశ్వత ముగింపు పలికింది.

# మహిళ జర్నలిస్టుపై దాడి..

## మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు




- హబ్సిగూడ, కుషాయిగూడ పన్నీర్ వ్యవహారంపై న్యాయం చేయాలని వేడుకోలు
- మహిళపై దాడి, అసభ్య దూషణలు, సెల్‌ఫోన్ లాక్కున్నారంటూ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆవేదన, సమగ్ర విచారణకు డిమాండ్
- మహిళలపై శారీరక, మానసిక వేధింపులను సహించేది లేదని మహిళా కమిషన్ హెచ్చరిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కల్తీ ఆహార పదార్థాల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో మహిళా జర్నలిస్టు పై దాడి జరిగిందని ఆరోపిస్తూ బాధితురాలు బొడిగె వాణి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లో పన్నీర్ ప్యాకింగ్‌కు సంబంధించిన వ్యవహారాన్ని అదేవిధంగా కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వద్ద కల్తీ పన్నీర్ అమ్మకాల వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లే సమయంలో తనపై దాడి చేశారని, అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి తోసివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించినప్పటికీ తనకు అసలు న్యాయం జరగలేదని బాధిత మహిళా జర్నలిస్టు ఆవేదన వ్యక్తం చేశారు.

### కల్తీని వెలుగులోకి తేవడం నేరమా.?

సమాజ శ్రేయస్సు, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కల్తీ ఆహార పదార్థాలపై ఎంతో కష్టపడి సమాచారం సేకరించి, వాస్తవాలను నిర్ధారించుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జర్నలిస్టుల బాధ్యత అని బాధితురాలు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారే కల్తీ ఆహారాన్ని అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఆ అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చి అధికారులకు సమాచారం ఇచ్చిన మహిళా జర్నలిస్టుపైనే దాడి జరిగిందని ఆరోపించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

### మహిళపై దాడి, మానసిక వేధింపులు

సభ్య సమాజం తలదించుకునేలా ఒక మహిళా జర్నలిస్టుపై శారీరక దాడితో పాటు అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరించడం, ఫోన్ లాక్కోవడం వంటి భయాందోళనలను కలిగించే ఘటనలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలపై శారీరక దాడులు మాత్రమే కాకుండా మానసిక వేధింపులు, అవమానించడం, బెదిరింపులకు పాల్పడటం కూడా తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలని మహిళా హక్కుల కార్యకర్తలు పేర్కొంటున్నారు.

మహిళలు తమ వృత్తి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న సమయంలో వారిని భయపెట్టడం, దూషించడం, అడ్డుకోవడం లేదా దాడులకు పాల్పడడం ఏ రూపంలోనూ సమర్థనీయం కాదని మహిళా కమిషన్ స్పష్టమైన వైఖరిని కలిగి ఉండాలని వారు కోరుతున్నారు.

### మహిళలపై దాడులు సహించేది లేదు

మహిళలపై శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై దాడులు జరిగితే ఘటనను తీవ్రంగా పరిగణించి బాధితురాలికి భద్రత, న్యాయం కల్పించాల్సిన బాధ్యత ఉన్నత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.

మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమనే స్పష్టమైన సందేశాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఇవ్వాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

### దాడి చేసిన వారెవరు.? కేసులు ఎవరిపై.?

తమపై దాడి ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్నాయని బాధిత జర్నలిస్టులు చెబుతున్నారు. వీడియో ఫుటేజీ, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, పోలీసులకు అందించిన ఫిర్యాదులు తదితర ఆధారాలను పరిశీలిస్తే ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది తేలుతుందని వారు పేర్కొన్నారు. తమ ఫిర్యాదును పూర్తిస్థాయిలో విచారించకుండానే ఎవరి ప్రోద్బలంతో జర్నలిస్టులపైనే కేసులు నమోదు చేశారనే ఆరోపణలపై కూడా ప్రత్యేక అధికారులచే సమగ్ర విచారణ జరిపించాలని మహిళా కమిషన్‌ను కోరుతున్నారు.

### పోలీసుల తీరుపై ప్రశ్నలు..

మహిళా జర్నలిస్టు తనపై దాడి జరిగిందని పోలీసులను ఆశ్రయించినప్పుడు ఆమె ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించారా.? ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీలు, వీడియో ఆధారాలను సేకరించారా.? ప్రత్యక్ష సాక్షులను విచారించారా.? దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. మహిళా బాధితురాలి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, అసభ్య పదజాలాలతో దూషించడం, దాడి చేయడం, మహిళ నుండి బలవంతంగా ఫోన్ లాక్కోవడం నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### అక్రమార్కులకు అండగా మారుతుందా.?

కల్తీ ఆహార పదార్థాలపై సమాచారం ఇచ్చే వ్యక్తులు, వాటిని వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు భయపడే పరిస్థితి ఏర్పడితే అక్రమ వ్యాపారం చేసే వారికి మరింత ధైర్యం చేకూరే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఉన్నతాధికారులు కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్న సమయంలో క్రింది స్థాయి అధికారులు ఫిర్యాదులు, దాడుల విషయంలో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తే ప్రభుత్వ చర్యలపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### పైస్థాయిలో ఉక్కుపాదం.. కిందిస్థాయిలో సహకారం.?

కల్తీ ఆహార మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ కిందిస్థాయి అధికారులు వారికి సహకారం అందిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నంత అధికారుల ఆదేశాల అమలు ఎలా ఉందన్నది ఓయూ, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే కల్తీ వ్యాపారాలను ఎలా అరికడతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### మహిళా కమిషన్ జోక్యం చేసుకోవాలి

మహిళా జర్నలిస్టుపై జరిగిన దాడి, అసభ్య పదజాలాలతో దూషణలు, సెల్‌ఫోన్ లాక్కోవడం, తోసి వేయడం పోలీసులకు చేసిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, అందుబాటులో ఉన్న వీడియో, ఆడియో ఆధారాలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని బాధితురాలు కోరారు.

ఘటనలో మహిళపై దాడి జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించాలని, బాధితురాలికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం

మహిళలపై దాడులు, వేధింపులు, బెదిరింపులు, దూషణలు, అవమానకర ప్రవర్తన వంటి ఘటనలను సాధారణ విషయాలుగా తీసుకోకూడదని మహిళా సంఘాలు పేర్కొంటున్నాయి. మహిళలు తమ వృత్తి, ఉద్యోగం లేదా ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సమయంలో వేధింపులకు గురైతే రాష్ట్ర మహిళా కమిషన్ వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం చాలా ఉందని మహిళలు కోరుతున్నారు. మహిళా జర్నలిస్టుపై దాడి ఆరోపణలపై ఉన్నత అధికారులచే నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, మహిళలపై దాడులు, అసభ్య పదజాలాలతో దూషణలు, మానసిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ఫుడ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు కల్తీ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి కానీ మహిళా జర్నలిస్టులపై కాదని అవినీతి, అక్రమాలు, కల్తీ వ్యాపారాలను వెలుగులోకి తీసుకువచ్చే వారిని భయపెట్టడం కాకుండా వారికి రక్షణ కల్పించాలని ప్రజలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. కల్తీ ఆహారంపై పోరాటం ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్నందున అసలు అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టం కఠినంగా వ్యవహరించాలని కానీ సమాచారం అందించిన వారిపై కఠినంగా వ్యవహరించడం కేసులు నమోదు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని , ఇప్పటికైనా ఉన్నత అధికారులు బాధిత మహిళా జర్నలిస్టుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.



మహిళా జర్నలిస్టుపై దాడికి తెగపడ్డ దృశ్యం



మహిళ జర్నలిస్టు నుండి దౌర్జన్యంగా ఫోన్ లాక్కున్న దృశ్యం

# వైద్యారోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకం








నాచారం (ప్రశ్న న్యూస్) వైద్యారోగ్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం ఒక గొప్ప వరమని, అంకితభావం, నిబద్ధతతో రోగులకు వైద్య సేవలు అందించి ఉన్నత స్థాయికి ఎదిగాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగా ఉద్యోగ బాధ్యతల్లో చేరిన 150 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్. యం ఎస్ మూర్తి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్. ఎస్ నర్సింహ, టీజీడిడిఏ (ఈఎస్ఐ యూనిట్) అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, టీఎన్జీఓ ఈఎస్ఐ అధ్యక్షులు వాసు, టీఎన్జీఓ ఐఎంఎస్ ఫోరం అధ్యక్షులు సీనయ్య, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ప్రేమలత, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహనాధ్యక్షులు వి. వేణుకుమార్ లు మాట్లాడుతు వైద్యారోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్ల ప్రాముఖ్యతను వివరిస్తు, వ్యాధుల బారి నుండి రోగులు స్వస్థత పొందడంలో వారికి అండగా, అందుబాటులో ఉండి సేవలందించడంలో నర్సింగ్ ఆఫీసర్ల బాధ్యత ప్రశంసనీయమన కొనియాడారు. కొత్తగా ఉద్యోగ బాధ్యతల్లో చేరిన నర్సింగ్ అధికారులు శక్తి వంచన లేకుండా విధులు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి తాము ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే ఆస్పత్రికి గుర్తింపు వచ్చేలా విధులు నిర్వహించాలని సూచిస్తు అభినందించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన (9) మంది నర్సింగ్ అధికారులను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలుకుతు వారి సేవలను కొనియాడుతు, ఉద్యోగ బాధ్యతల నిర్వాహణలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఈఎస్ఐ బ్రాంచ్ అధ్యక్షులు జి. విక్టోరియా, అరుణ, చంద్రకళ, రాణి, భాగ్య, శ్రీలత, అంజనీ, కల్పన, రుద్రమదేవి, యూనియన్ ఆఫీస్ బేరర్లు సంతోష్, రఘు, నర్సింగరావు, రమేశ్, కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశారు.

# వైఎస్ జగన్ VS నారా లోకేష్!

## - సీబీఐ దర్యాప్తునకు వైసీపీ అధినేత ఛాలెంజ్! - డీఎస్సీకి ఏపీపీఎస్సీకి అవగాహన లేదా అంటూ మంత్రి కౌంటర్!

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి, ప్రతిపక్షం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మధ్య గ్రూప్ 1, డీఎస్సీ వివాదంలో మరోసారి సవాళ్ల పర్వం నడుస్తోంది. తమ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్ -1 పరీక్షలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని వైసీపీ అధినేత వైఎస్ జగన్ సవాల్ చేశారు. డీఎస్సీలో అక్రమాలపై సీబీఐ విచారణ రెడీనా అంటూ ప్రశ్నించారు. దీనికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అంతే దీటుగా కౌంటర్ ఇచ్చి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీన్ని డైవర్ట్ చేయడానికి ఏపీపీఎస్సీ గ్రూప్ -1 వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ఆయన బహిరంగ సవాల్ చేశారు. తన హయాంలో నిర్వహించిన గ్రూప్ 1పై గత ఏడాది నిర్వహించిన డీఎస్సీపై సీబీఐ విచారణకు పిలవాలని డిమాండ్ చేశారు. "మా హయాంలో అత్యంత పారదర్శకంగా విప్లవాత్మక సంస్కరణలతో ఉద్యోగ నియామకాలు చేపట్టాం. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఏకంగా లక్షా 30 వేల ఉద్యోగాలను నిరుద్యోగులకు అందించిన ఘనత మా ప్రభుత్వానిది. అంతేకాకుండా, వివిధ విభాగాల్లో 78 నోటిఫికేషన్ల ద్వారా 6, 296 ఉద్యోగాలను భర్తీ చేశాం. ఈ నియామకాలన్నింటిలోనూ ఒక్కంటే ఒక్క అవినీతి ఆరోపణల కూడా రాలేదు." అని వైఎస్ జగన్ అన్నారు. 2018 నాటి గ్రూప్ -1 నియామక ప్రక్రియపై సిట్ విచారణ జరిపించినా ఏమీ తేలలేదని, అయినా సరే దీనిపై సీబీఐ దర్యాప్తునకు తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నాని చెప్పారు. మరి ఇదే ధైర్యంతో కూటమి ప్రభుత్వం గత ఏడాది నిర్వహించిన డీఎస్సీ పరీక్షలపై సీబీఐ విచారణ జరిపించేందుకు సిద్ధంగా ఉందా అని చంద్రబాబు, లోకేష్‌ను ప్రశ్నించారు. ' మేం ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టే తల ఎత్తుకుని విచారణను కోరుతున్నాం. కూటమి ప్రభుత్వం కూడా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి కేంద్ర దర్యాప్తు సంస్థకు లేఖ రాయాలి" అని జగన్ డిమాండ్ చేశారు.




### మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్

వైఎస్ జగన్ చేసిన ఆరోపణపై విసిరిన సవాళ్లపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా కౌంటర్ ఇచ్చారు. ' ఏపీపీఎస్సీ అంటే ఏంటీ? డీఎస్సీ అంటే ఏంటీ? అనే కనీస అవగాహన కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు లేదు. ఈ రెండు వేర్వేరు పరీక్షలని, వీటి విధి విధానాలు వేరని తెలియకుండా రెండింటినీ ఒకే గాటన కట్టి మాట్లాడటం ఆయన అజ్ఞానానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏయే పరీక్షలను ఏయే పద్ధతుల్లో నిర్వహిస్తుందో కూడా తెలియని వ్యక్తి మన రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు పాలించడం మన దౌర్భాగ్యం" అని లోకేష్ ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల ముఖ్యమంత్రి పాలన కాలంలో రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం ఒక్కటంటే ఒక్క డీఎస్సీ పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని లోకేష్ ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న జగన్‌కు ఈరోజు డీఎస్సీ నియామకాలపై మాట్లాడే అర్హత ఎంతమాత్రం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ, ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీ వేదికగా చర్చ జరిపేందుకు సిద్ధం కావాలని సవాల్ విసిరితే, అసెంబ్లీకి రాకుండా జగన్ పారిపోయారని లోకేష్ ఎద్దేవా చేశారు. సభలో ఎదుర్కొనే ధైర్యం లేకనే బయట ప్రెస్‌మీట్ పెట్టి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# స్థానిక పోరుకు జనసేన సై

## - ఆ వ్యూహం గత ఎన్నికలకే పరిమితమన్న పవన్ కల్యాణ్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికలే లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి భిన్నంగా, క్షేత్రస్థాయి బలాబలాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో జనసేన ప్రభావశీలమైన పోటీ ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనసభ ప్రాంగణంలోని తన కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభ పక్ష సమావేశంలో ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్నో దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. "నామినేషన్ వేయలేని పరిస్థితులు సృష్టించినా, అప్పటి పాలకులను ఎదిరించి పోటీలో నిలిచిన మన శ్రేణుల త్యాగం విలువైనది. వారి స్ఫూర్తికి తగిన గౌరవం దక్కేలా ఈసారి జనసేన నిలబడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అప్పటి దాష్టీక పాలనను అంతం చేయాలనే లక్ష్యంతోనే జనసేన కేవలం 21 స్థానాలకు పరిమితమై పోటీ చేసిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో ప్రాంతాలవారీగా రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే



పరిమితం కాకుండా, తమ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో జనసేన బలాబలాలను అంచనా వేయాలని ఆదేశించారు. పోటీకి అనువైన స్థానాలను గుర్తించి, పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని సూచించారు.

రాబోయే ఎన్నికల కార్యాచరణ, విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల నేతల వైఖరి వల్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోందని, కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని, పార్టీ శ్రేణుల మనోభావాలను తప్పక గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వారికి రాజకీయంగా అండగా నిలుస్తూ, మెరుగైన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సుదీర్ఘ సమావేశంలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ సహా పలువురు జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయండి

## - రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఏ జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని లేఖలో ఆరోపించారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది అని చెప్పుకొచ్చారు. 'నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 22ఏ పై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు' అంటూ రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖలో ఆరోపించారు.

### కమీషన్లు తీసుకుని రిజిస్ట్రేషన్లు

కమీషన్లు తీసుకుని 22ఏ నుంచి తీసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు అంటూ మాజీమంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. బుద్వేల్ గ్రామంలో 30 ఎకరాల భూమి 22ఏ లో ఉంటే డబ్బులు తీసుకుని నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ చేశారు అని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. అలాగే శేరిలింగంపల్లిలో 20/1 సర్వే నంబర్‌లో ఉన్న భూమి 22ఏ లో ఉంటే, డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి, 10 రోజులకు మళ్లీ 22ఏ లో పెట్టారు అని ధ్వజమెత్తారు. ఇలా అనేక ప్రాంతాల్లో కమీషన్లు తీసుకుని 22ఏ నుంచి భూములు తొలగించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు అని మాజీమంత్రి హరీశ్ రావు రాహుల్ గాంధీకి రాసిన లేఖలో ధ్వజమెత్తారు.

### కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్న రెవెన్యూ శాఖ

చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని మాజీమంత్రి హరీశ్ రావు లేఖలో ఆరోపించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చి వేధింపులకు గురి చేయడం తీవ్ర దుర్మార్గం అని మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.

### మంత్రి కోమటిరెడ్డి ఆరోపణలపై స్పందించని సీఎం

అంతేకాదు రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందంటూ మాజీమంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై తీవ్రంగా ఒత్తిడికి గురి చేయడం ఎంత వరకు న్యాయం అని నిలదీశారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను ఈ జాబితాలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టారని మాజీమంత్రి ఆరోపించారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు.

### మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయకపోతే పోరాటం చేస్తాం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి 22ఏ జాబితాలో కొత్తగా చేర్చిన, అలాగే తొలగించిన ప్రతి భూమి వివరాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా ఈ నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని ఓపెన్ సవాల్ విసిరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడేందుకు ప్రజల నమ్మకాన్ని పణంగా పెడుతున్నారని...రాహుల్ గాంధీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. 22ఏ పై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. చేయని పక్షంలో బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని మాజీమంత్రి హరీశ్ రావు లేఖలో హెచ్చరించారు.

# మల్లన్న క్షేత్రం లో 2వ సామూహిక వరలక్ష్మీ వ్రతములు

శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దేవస్థానం ఆగస్టు 28 నాడు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తోంది. అదే విధంగా శ్రావణ మూడవ శుక్రవారం 28 నాల్గవ శుక్రవారం 4 నాడు రోజున కూడా ఈ సామూహిక వ్రతాలను నిర్వహించబడుతాయి.



ఆగస్టు 21 నాడు జరుగనున్న ఈ సామూహికవ్రతంలో 1500 మంది ముత్తైదువులకు అవకాశం కల్పించబడుతోంది. వీటిలో 500 టోకెన్లను ఆన్‌లైన్ నందు ఉంచడం జరిగింది. తక్కిన వాటిని మ్యానువల్ విధానంలో ప్రజాసంబంధాల విభాగం ద్వారా అందివ్వడం జరిగిందన్నారు. కాగా శివసేవకుల సౌకర్యార్థం నూతనంగా మూడవ శుక్రవారం 28 తేదీనాడు శివసేవకులకు అవకాశం కల్పించబడింది. అదేవిధంగా నాల్గవ శుక్రవారం రోజున 750 మందికి పైగా చెంచు ముత్తైదువులకు, 750 మందిదాకా ఇతర భక్తులకు అవకాశం కల్పించబడింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణమండపంలో ఈ వ్రతాలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులలో మన సనాతన ధర్మంపై అవగాహన కల్పించి, వారిలో ధార్మిక చింతనను పెంపొందించేందుకు ఈ వ్రతాలు నిర్వహించడుతున్నాయని అన్నారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా మూడవ శుక్రవారం రోజున శివసేవకులకు ఈ సామూహిక వ్రతాలను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కాగా ధర్మప్రచార కార్యక్రమములో భాగంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతంలో పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూరుస్తుందన్నారు. వ్రత కార్యక్రమంలో పాల్గొనే ప్రతీ ముత్తైదువ కోసం వేర్వేరు కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వ్రతాన్ని జరిపించుకునే ముత్తైదువులకు అమ్మవారి శేషవస్త్రాలుగా చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, లడ్డు ప్రసాదం, పుస్తక ప్రసాదంగా శ్రీశైలప్రభ, వృక్ష ప్రసాదంగా తులసి, ఉసిరి మొదలైన దేవతా మొక్కలను ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్రతానంతరం ముత్తైదువులందరికీ వారు ధరించేందుకు వీలుగా శ్రీస్వామిఅమ్మవార్ల కైలాస కంకణాలు కూడా అందజేయబడుతుందని తెలిపారు.

# సుష్మిత వ్యాఖ్యాలు బాధాకరం

**నిజామాబాద్** కొండా సుస్మిత వ్యాఖ్యల పై.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం, తీవ్రంగా ఖండిస్తున్నాం. సుస్మిత వ్యాఖ్యల పై మంత్రి కొండా సురేఖ కు షోకాజ్ నోటీసులు ఇచ్చామని అన్నారు. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి వివరణ కోరాం. వివరణ ఇచ్చాక తదుపరి చర్యకు తీసుకుంటాం. చిన్నారెడ్డి సీనియర్ నాయకులు , పార్టీ లైన్ దాటితే క్రమ శిక్షణ చర్యలు తప్పవు. అభ్యర్థులను ఎవరు ప్రకటించిన అవి చెల్లవు. పార్టీలో ఓ విధానం ఉంటుంది. ఎన్నికల కమిటీ, సిడబ్ల్యూసి నిర్ణయం ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందని అన్నారు.

# ముఖ్యమంత్రి నోటి దురద తగ్గించుకో...

**- మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్** వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రెస్ మీట్ లో మాట్లాడారు. తలసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనే సోయి మరిచి బూతులు మాట్లాడటం మానుకో. టిమ్స్ హాస్పిటల్ పనులు కేసీఆర్ ప్రభుత్వం లోనే ప్రారంభించాం. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిబ్బన్ లు కటింగ్ చేస్తున్నడు. ఎదుటి వారికి గౌరవం ఇచ్చి మాట్లాడాలి అన్న సోయి కూడా ముఖ్యమంత్రి కి లేదని అన్నారు.

మహంకాళి జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తే స్థానిక ఎమ్మెల్యే గా గౌరవించి స్వాగతం పలికినా. కరోనా సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టి లో ఉంచుకొని భవిష్యత్ అవసరాల దృష్ట్యా సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట లలో టిమ్స్ హాస్పిటల్ కు కేసీఆర్ శంఖుస్థాపన చేశారు. మంది పిల్లలను మా పిల్లలుగా మేము చెప్పుకోము. మా ప్రభుత్వం లో 60 శాతం పనులు జరిగాయి. పనులు పూర్తి కాకుండా, సౌకర్యాలు కల్పించకుండానే హడావుడిగా హాస్పిటల్ ను ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చింది. హాస్పిటల్ సందర్శిస్తామంటే హౌస్ అరెస్ట్ లు ఎందుకు చేశారు.. ఎందుకు అంత భయమని ప్రశ్నించారు. 22 ఏ తీసుకొచ్చింది మీరు కాదా? పొరపాటు జరిగాయని మంత్రి క్షమాపణ చెప్పడం అంతా డ్రామా . 22 ఏ ను అడ్డం పెట్టుకొని 30 నుండి 40 శాతం కమిషన్ లు వసూలు సెటిల్ మెంట్ లు చేయలేదా? ప్రయివేట్ భూములు, పేదల ఇండ్లను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని అన్నారు.

## అటవీ ప్రాంత సంరక్షణ కోసం

# సమన్వయంతో కృషి చేయాలి

**- జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిజామాబాద్,** జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ఇంచార్జి మంత్రిని

# మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



**నిజామాబాద్ :** నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.ద

వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# గ్యాస్ బండపై రూ.40 బాదుడు

- డెలివరీ, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో అదనపు వసూళ్లు...
- ఇంటి గుమ్మం వరకు సిలిండర్ దిగుమతి చేయకుండానే చార్జీలు
- బిల్లు అడిగితే “సంతకమే బిల్లు”
- భారత్ గ్యాస్ తీరుపై గ్రామీణ వినియోగదారుల ఆగ్రహం
- అధికారుల తక్షణ జోక్యానికి డిమాండ్



**బోనకల్** పల్లె ప్రజలే టార్గెట్‌గా మారారా? బోనకల్ గ్రామంలోని వత్సవాయి రోడ్డులో ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ వ్యవహారంపై గ్రామీణ వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.డెలివరీ, ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరుతో ఒక్కో గ్యాస్ సిలిండర్‌కు రూ.35 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.మండల కేంద్రం నుంచి తమ గ్రామాల వరకు గ్యాస్ వాహనం వస్తుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అదనపు డెలివరీ చార్జీ తీసుకుంటున్నప్పటికీ కనీసం ఇంటి గుమ్మం వరకు సిలిండర్‌ను తీసుకెళ్లి దింపడం లేదని ఆరోపిస్తున్నారు.పల్లె ప్రజల అవసరమే ఆసరానా?గ్యాస్ సిలిండర్ ప్రతి ఇంటికి తప్పనిసరి నిత్యావసరం కావడంతో.. దాని కోసం వినియోగదారులు తప్పనిసరిగా ఏజెన్సీపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అదనపు చార్జీలపై ప్రశ్నిస్తే మేము ప్రజల కోసమే పనిచేస్తున్నాం.. కనీసం బండకు రూ.40 ఇవ్వలేరా?” అంటూ ఘాటుగా సమాధానం చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు. దీంతో తమ సమస్యను ప్రశ్నించేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు వాపోతున్నారు.బిల్లు లేదు.. బుక్కులో సంతకమే!ఇక బిల్లు విషయంలోనూ వినియోగదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ తీసుకున్న తర్వాత సరైన బిల్లు ఇవ్వకుండా బుక్కులో సంతకం మాత్రమే తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. బిల్లు అడిగితే “సంతకమే బిల్లు” అంటూ సమాధానం ఇస్తున్నారని చెబుతున్నారు.దీంతో సిలిండర్ అసలు ధర ఎంత? అదనంగా తీసుకుంటున్న రూ.35?40 ఏ చార్జీకి సంబంధించినది? అనే విషయాల్లో గ్రామీణ వినియోగదారులకు స్పష్టత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ ఏది?పల్లె ప్రజల నుంచి అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ భారత్ గ్యాస్ ఏజెన్సీపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అదనపు వసూళ్ల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు సరైన బిల్లులు అందేలా చూడాలని కోరుతున్నారు.“పల్లె ప్రజల జేబులపై భారం వేస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకుంటారా? గ్రామీణ వినియోగదారులకు న్యాయం చేసేది ఎవరు?” అంటూ బోనకల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు దారి మళ్లిస్తే కఠిన చర్యలు

**- ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**జయశంకర్ భూపాలపల్లి.** ఎస్సి, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మల్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు.కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధులు వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాద్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు.కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.కేసుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు.ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలిప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ప్రమోషన్లలో రిజర్వేషన్ నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా పాటించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులకు భంగం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.బాధితులకు పరిహారంతో పాటు ఉపాధి, పునరావాసంతీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్య, అత్యాచారం వంటి ఘటనలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతోనే వదిలేయకుండా వారి పునరావాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని చైర్మన్ సూచించారు.నిబంధనల ప్రకారం అర్హులైన బాధితులకు పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి అవకాశాలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.బాధిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలిప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలిగ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, ఇతర నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి పంచాయతీ నిధులు లేదా సీఎస్ఆర్ నిధుల ద్వారా సిసి కెమెరాలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా పెంచడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు నేరాలు జరిగినప్పుడు దర్యాప్తుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ఎస్సీ, ఎస్టీ ప్రజల పట్ల అధికారులు మానవీయ కోణంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలని అన్నారు.ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, వాటిని నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు సమయపాలనతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చైర్మన్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హత ఉన్న వారికి పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.అధికారుల సమన్వయంతోనే మెరుగైన ఫలితాలుఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో పథకాల అమలును పర్యవేక్షించాలని సూచించారు. విదేశీ విద్యా, బాధితులకు పరిహారం, కులాంతర వివాహం చెల్లింపులు పెండింగ్ ఉన్నవాటి నివేదిక అందచేయాలని ఎస్సి అభివృద్ధి అధికారిని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బాధితులకు కమిషన్ సూచించిన విధంగా ఇళ్ళు కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పక పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ అత్యాచార తదితర సంఘటనలపై తక్షణమే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కమిషన్ నుండి 6 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మూడు కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ కు సబ్యులకు జ్ఞాపిక అందచేశారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఎస్సి అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు సూర్య నారాయణ, సంపత్ రావు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోలు వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**సిర్పూర్** సిర్పూర్ యు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆత్రం శంకరరావు ఆధ్వర్యంలో భారత రత్న అవార్డు గ్రహీత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ఆత్రం శంకరరావు మాట్లాడతూ, రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నపుడు దేశ ప్రజల కోసం , బడుగు బలహీన వర్గాలు బఇ,బబి, ఎఇ మైనార్టీ, పేదల కోసం ఎన్నలేని సేవలు చేసిన్నారని ఆ సేవలకు గుర్తింపుగా భారత రత్న అవార్డు కూడా తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బుర్నూర్ సర్పంచ్ గణపత్ రావు ధనోర సర్పంచ్ స్పందన భూపత్, రాఘపూర్ సర్పంచ్ లక్ష్మి భీర్ష, మహాగావు సర్పంచ్ జానరావు, సీతగొంది సర్పంచ్ బాపూజీ,జీఎఇ డైరెక్టర్ లచ్చన్న, సిర్పూర్ యు ఉప సర్పంచ్ రామారావు,వలీ ఎంపీటీసీ గోవింద్ రావు,వలీ ఎంపీపీ ఆత్రం దౌలత్ రావు, సీనియర్ నాయకులు సోయం మొతిరం, దేవీదాస్, మెస్రం జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుకకు తెలంగాణ బాట!

పేదలకు నిర్మాణ అవసరాల కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుక? అక్రమార్కులకు మాత్రం ఆదాయ వనరుగా మారుతోందా ? జగ్గయ్యపేట నియోజకవర్గం రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఉచిత ఇసుకను తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నప్పటికీ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వస్తున్నాయి.ఒకచోట ఇసుకను భారీగా కుప్పలుగా నిల్వ చేయడం రాత్రి వేళల్లో లారీల్లో తరలించడం మరోచోట సరిహద్దుకు సమీపంలో ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసి రాష్ట్ర సరిహద్దు దాటించడం ఇలా అక్రమ రవాణాకు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.(పాలేరు వాగు పరిసరాల్లో ఇసుకను తీసుకొచ్చి రాతిబండలపై లారీల నుంచి అన్‌లోడ్ చేసి? అక్కడి నుంచి తెలంగాణకు చెందిన ట్రాక్టర్లలో తిరిగి లోడ్ చేసి తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.మరో ట్విస్ట్:గూడ్స్ క్యాబిన్ కలిగిన భారీ లారీలను ఉపయోగించి కూడా ఇసుకను సరిహద్దు దాటిస్తున్నారనే వాదనలు ఉన్నాయి.

యాంకర్/వాయిస్ ఓవర్:ఇక్కడ అసలు ప్రశ్నలు ఇవే జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రస్తుతం ఏయే ఇసుక రీచ్‌లకు అధికారిక అనుమతులు ఉన్నాయి ఎక్కడి నుంచి ఎంత ఇసుక తరలించేందుకు అనుమతి ఉంది రోజుకు ఎంత ఇసుక రవాణా అవుతోంది సరిహద్దు చెక్‌పోస్టుల మీదుగా వెళ్లే వాహనాలపై నిఘా ఎంతవరకు ఉంది ప్రత్యేక ఫోకస్:అనుమతులు లేని ప్రాంతాల్లో ఇసుక తవ్వ కాలు జరుగుతున్నాయా వాల్టా నిబంధనలు ఉల్లంఘిస్తే భవిష్యత్తులో నీటి ప్రవాహ ప్రాంతాలు దెబ్బతిని నీటి కొరతకు కారణమయ్యే ప్రమాదం ఉందా అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ప్యాకేజీ ముగింపు:ప్రభుత్వం పేదలకు అందించాల్సిన ఉచిత ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే అసలు ఉచిత ఇసుక విధానం లక్ష్యం ఏమవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాలకు ఉచిత ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్న నేపథ్యంలో జగ్గయ్యపేట సరిహద్దులో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వణుకు పుట్టిస్తున్న వైద్య ఖర్చులు




**ముంబై :** ఊహించని వైద్య ఖర్చులు తమకు ఒత్తిడిని కలిగిస్తున్నాయని 94 శాతం మంది భావిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. భారత్‌లో ఉద్యోగ భద్రత, ప్రపంచ అస్థిరత, ఇఓఎల కంటే కూడా పెరుగుతున్న మెడికల్ ఖర్చులే ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయని టాటా ఏఐజీకి చెందిన 'ది కార్పొరేట్ హెల్త్ ప్రొటెక్షన్ పల్స్ 2026' అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం కోల్పోతే దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు 6 నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నెట్టుకురాగలరు.ప్రొటెక్షన్ గ్యాప్ ? పని చేసే సంస్థ ఇచ్చే బీమాతో పాటు అదనపు ఆరోగ్య బీమా ఉండటం ముఖ్యమని 84 శాతం మంది భావిస్తున్నారు, అయినప్పటికీ దాదాపు సగం మంది ఉద్యోగులు పనిచేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ) కాకుండా వ్యక్తిగత ఆరోగ్య బీమాను కలిగి లేరు. అవగాహన లోపం, తర్వాత కొనుగోలు చేద్దాంలే అనే అలవాటు వ్యక్తిగత ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయి. భారత శ్రామిక శక్తిపై ఆరోగ్య సంరక్షణ మోపుతున్న పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కూడా ఈ అధ్యయనం తెలిపింది. ఊహించని వైద్య ఖర్చులు తమకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయని ఇందులో పాల్గొన్న దాదాపు 94 శాతం మంది (రెస్పాండెంట్లు) తెలిపారు. ఉద్యోగం కోల్పోవడం లేదా కెరీర్ ఆగిపోవడం కంటే పెద్ద ఆందోళనగా మారింది. ఉద్యోగం లేకుండా ఒక ఏడాది కంటే ఎక్కువ రోజులు తాము ఆర్థికంగా నెట్టుకురాగలమని కేవలం 12% మంది మాత్రమే భావిస్తున్నారు. ఉద్యోగం కోల్పోయినప్పుడు దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నిలదొక్కుకోగలమని చెప్పారు. దీర్ఘకాలం ఆదాయాన్ని కోల్పోవడాన్ని తట్టుకునేందుకు చాలా మంది కార్పొరేట్ ఉద్యోగులు సిద్ధంగా లేరని ఈ ఫలితాలు వెల్లడించాయి.కుటుంబానికి ఆరోగ్య బీమా, ఆసుపత్రి ఖర్చులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల కోసం పొదుపు లేకపోవడం వంటివి కార్పొరేట్ భారత్‌లో ప్రధాన 5 ఆరోగ్య సంబంధిత ఆందోళనకర అంశాలుగా నిలిచాయి. ఉద్యోగం మారే సమయంలో ఆదాయం కోల్పోవడం, ఇఓఎలను మించి వైద్య ఖర్చులే అతిపెద్ద ఆర్థిక ఆందోళన అని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. రెస్పాండెంట్లలో ఉద్యోగం మారే సమయంలో అంతరాయం లేని ఆరోగ్య బీమా కవరేజ్ ముఖ్యం అని 88 శాతం మంది భావిస్తున్నప్పటికీ, మెడికల్ కవరేజీ కొనసాగింపును అందించే సొల్యూషన్స్ కేవలం 40% మందికే తెలుసు. అంటే ఉద్యోగ మార్పు ఈ కీలక దశలో బీమా గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. "కార్పొరేట్ ఉద్యోగులు పని చేసే సంస్థ అందించే ఆరోగ్య బీమాను ఎలా చూస్తున్నారనేది అర్థం చేసుకోవడం. సన్నద్ధతలో ఇప్పటికీ ఉన్న లోటుపాట్లను గుర్తించడం ఈ అధ్యయనం ఉద్దేశ్యం. ఉద్యోగుల శ్రేయస్సుకు గ్రూప్ మెడికల్ కవర్ ముఖ్యమే అయినప్పటికీ, వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగ మార్పు సమయంలో తమ కవరేజ్ ఏ మేరకు ఉంటుందో.. అది సరిపోతుందో లేదో చాలా మందికి క్లారిటీ లేదు. వైద్య ఖర్చులు పెరుగుతున్న కొద్దీ, అవగాహన, ఆర్థిక సన్నద్ధత మరింత ముఖ్యం. ఈ విశ్లేషణలు, ఉద్యోగులు తమ ఆరోగ్య రక్షణ అవసరాలపై సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. ఆర్థికంగా నిలకడైన శ్రామిక శక్తిని నిర్మించడానికి యజమానులు, బీమా సంస్థలు, విధానకర్తల మధ్య మెరుగైన సహకారాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నట్లు" టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ రీటైల్ – హెల్త్ అండర్‌రైటింగ్ హెడ్ డాక్టర్ సంతోష్ పురి తెలిపారు.ఉద్యోగం చేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ)ని నిశితంగా పరిశీలిస్తే కొన్ని విషయాలు బయటపడతాయి. కంపెనీ అందించే జీఎంసీతో పాటు అదనపు ఆరోగ్య కవరేజ్ కలిగి ఉండాలని 84% మంది నమ్ముతున్నప్పటికీ, యజమాని అందించే కవర్ కాకుండా దాదాపు సగం మంది (45 శాతం) ఎలాంటి అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి లేరు. అదనపు ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి అవగాహన లోపం, తర్వాత పాలసీ తీసుకుందామనే వైఖరి ప్రధాన అడ్డంకిగా ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా 28–34 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇది ఎక్కువగా ఉంది.ఈ అధ్యయనం ద్వారా ఉద్యోగులు తమ గ్రూప్ మెడికల్ కవరేజ్ (జీఎంసీ) పట్ల సంతృప్తిగా ఉన్నప్పటికీ, ఆ కవరేజ్ ఎంతవరకు సరిపోతుందనే దానిపై వారికి నమ్మకం లేదు. అత్యవసర ఆసుపత్రి చేరిక సమయంలో యజమాని అందించే జీఎంసీ ఒక్కటే సరిపోదని దాదాపు 75 శాతం మంది అంగీకరించారు. కంపెనీ అందించే ఆరోగ్య బీమా పరిధి, పరిమితులపై ఉద్యోగుల అవగాహనలో లోపాలను ఈ సర్వే వెలుగులోకి తెచ్చింది. యజమాని అందించే జీఎంసీ అన్ని ఫీచర్లు, ప్రయోజనాల గురించి తమకు పూర్తిగా తెలుసునని కేవలం 41 శాతం మంది ఉద్యోగులు చెప్పారు.

ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణే, కోల్‌కతా నగరాల్లో 28–55 సంవత్సరాల వయస్సు గల 748 మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు షేర్ చేసుకున్నారు. అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడానికి కుటుంబ రక్షణే బలమైన ప్రేరణగా నిలుస్తోంది. టాప్-అప్ ప్లాన్‌ను పరిశీలిస్తున్నప్పుడు తాము చూసే అత్యంత ముఖ్యమైన ఫీచర్లుగా ఎక్కువ బీమా మొత్తం, కుటుంబ సభ్యులకు కవరేజ్, ఉద్యోగం మారే సమయంలో కవరేజ్ కొనసాగింపు ఉండాలని కోరుకుంటున్నట్లు రెస్పాండెంట్లు పేర్కొన్నారు.

## కాసులు కురిపిస్తున్న బోడ కాకరకాయలు



**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో బోడకాకర ఈ సీజన్‌లో మార్కెట్లో ఎక్కడ చూసినా కనిపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి, ఆదిలాబాద్ రూరల్ , మండలాల్లోని పలు అటవీ ప్రాంతాల్లో ఉట్నూర్ ఏజెన్స్ ప్రాంతంలో, అటూ కవ్వాల్ అభయారణ్యం అటవీ ప్రాంతాల్లో బోడ కాకర కాయలు విరివిగా దొరుకుతాయి. పక్కనున్న మహారాష్ట్ర సరిహద్దులోని మాండ్వి, కిన్వట్, బోరీ, పాంఢ్రకవడ, ఘాటంజి తదితర ప్రాంతాల్లోను ఎక్కువగా దొరుకుతాయి. ఇక్కడి ప్రాంతవాసులు సైతం ఆదిలాబాద్‌కు తీసుకొచ్చి మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. ఇవి కేవలం అటవీ ప్రాంతంలోనే కాదు దట్టమైన పొదల్లో, చెట్లకు అల్లుకొని ఉన్న తీగల్లోను ఈ బోడ కాకరకాయ పెరుగుతుంది. జూలై నుంచి ఆగస్టు, సెప్టెంబర్ నెల వరకు మాత్రమే ఇవి కాస్తాయి. బోడకాకర కాయలు సహజంగా లభిస్తాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో బోడ కాకరలు ఎక్కువగా దొరుకుతున్నాయి. ఆదిలాబాద్ రైతు బజార్‌తోపాటు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌లపై అమ్మకాలు చేస్తున్నారు. అమ్మకాలు చేసే వారు ఎక్కువగా అడవుల్లో బుర్క పిట్టలు, ఇతర అడవి ప్రాంతాల వనరులపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ సీజన్‌లో మాత్రం బోడకాకరలను ఎక్కువగా వీరే తీసుకొస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్‌లో బోడకాకర కిలో రూ.200 ధర పలుకుతోంది. ఒక్క రోజు ఒక్కొక్కరు చొప్పున సుమారు వెయ్యి, నుంచి 2వేల వరకు అమ్మకాలు చేసి ఉపాధి పొందుతున్నారు. బోడకాకరను తెంపడం కొంచెం కష్టంగా ఉంటుంది. ఉదయం వేకువ జామున అడవుల్లోకి వెళ్ళి చెట్ల పొదల్లో విష కీటకాల నుంచి తమను తాము రక్షించుకుంటూ ఈ బోడ కాకరలను సేకరిస్తున్నామని రాథోడ్ వివరించారు. జిల్లాలో ఎక్కువగా అడవుల్లో తమ సామాజిక వర్గానికి చెందిన వారు బోడకాకర సేకరిస్తూ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్‌లో రూ.200కేజీ అమ్ముతున్నామన్నారు. వచ్చిన డబ్బులతో తమ కుటుంబం కోసం వివిధ అవసరాల కోసం ఉపయోగిస్తున్నామని, ఈ సీజన్‌లో మాత్రమే సెప్టెంబర్ వరకు దొరుకుతాయని అన్నారు.ప్రస్తుతం శ్రావణమాసం సందర్భంగా ఎక్కువగా అందరు మాంసాహారాన్ని మానేసి బోడ కాకరను తింటున్నారు. వానాకాలంలో చికెన్, మటన్ కంటే ఔషధ గుణాలున్న బోడ కాకరకాయ తింటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం తక్కువ అని డాక్టర్లు సైతం చెబుతుంటారు. చాలామంది శ్రావణమాసంలో మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ బోడ కాకరకాయను కొన్ని ప్రాంతాల్లో ఆగాకర, బొంత కాకర, అడవి కాకర, వంటి పేర్లతో కూడా పిలుస్తారు. మరాఠీ, హిందీ భాషల్లో ఇక్కడి ప్రాంత వాసులు కర్టులే, కంటోలా అని పిలుస్తారు. సాధారణ కాకరకాయతో పోలిస్తే చిన్నగా, పైభాగంలో ముళ్లలాంటి పొరతో కనిపించే ఈ కూరగాయకు ఈ సీజన్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. రుచి మాత్రమే కాకుండా ఇందులో పలు రకాల పోషకాలు ఉండటం దీని ప్రత్యేకత. బోడ కాకరకాయలో పీచు, విటమిన్ ఏ, విటమిన్ సీ, విటమిన్ కె, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు లభిస్తాయి. అంతేకాకుండా యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగిన ఫైటోన్యూట్రియెంట్లు కూడా ఉంటాయి. ఇవి శరీరంలో కణాలను దెబ్బతీసే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఈ బోడకాకరలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆహారం సులభంగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గడానికి పీచు సహాయపడుతుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువును నియంత్రించుకోవాలనుకునేవారు కూడా దీన్ని సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. ఎక్కువ నూనెతో కాకుండా తక్కువ నూనెతో వండితే మరింత ఆరోగ్యకరమైన ఎంపికగా ఉంటుంది. వర్షాకాలంలో లభించే ఈ కూరగాయలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు ఉండటం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన పోషకాలను అందించడంలో కూడా తోడ్పడుతుంది. చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు ఇందులో ఉండటం మరో ప్రయోజనం.బోడ కాకరకాయతో పులుసు, కూర, వేపుడు, పొడి, బిర్యానీ వంటి వంటకాలు చేసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల కోసం ఎక్కువ నూనె, ఉప్పు కలపకుండా వండటం మంచిది. మధుమేహం లేదా బీపీకి మందులు వాడుతున్న వారు ఆహారంలో మార్పులు చేసే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. సరైన ఆహారం, వ్యాయామం, నిద్రతో పాటు ఇలాంటి సీజనల్ కూరగాయలను మితంగా తీసుకోవడం ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడుతుంది.

## నరకప్రాయం...ఈ రహదారి

**హైదరాబాద్ :** విశ్వనగరంగా గ్లోబల్ మ్యాప్‌పై మెరుస్తున్న హైదరాబాద్‌లో ప్రయాణం రోజురోజుకూ సగటు పౌరుడికి ఒక నరకప్రాయ అనుభవంగా మారుతోంది. ఐటీ రంగానికి గుండెకాయ లాంటి గచ్చిబౌలి, మాదాపూర్ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వరకు ప్రయాణించాలంటే గంటల తరబడి రోడ్లపైనే నరకం చూడాల్సి వస్తోంది. ఇటీవల హెచ్-సిటీ ఫ్లైఓవర్ , అండర్‌పాస్ పనుల నెపంతో కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్-వే విధానాన్ని అమలులోకి తీసుకురావడం ఈ సమస్యను మరింత జటిలం చేసింది. పైలట్ డ్రైవ్‌లు పూర్తి చేశామని అధికారులు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాల అవగాహన లేక, అశాస్త్రీయమైన డైవర్షన్ల వల్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.మరోవైపు గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బీహెచ్ఈఎల్, మియాపూర్ ప్రధాన రహదారులతో పాటు కనెక్టింగ్ రోడ్లు అన్నీ భారీ గోతులతో నిండిపోయాయి. వర్షాలు పడినప్పుడల్లా మోకాటి లోతు నీరు చేరడం, ఆ గుంతల్లో వాహనాలు చిక్కుకుపోవడంతో ఐటీ ఉద్యోగుల రాకపోకలు గంటల కొద్దీ ఆలస్యమవుతున్నాయి. సీఎస్ఆర్, మున్సిపల్ రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రచారం జరుగుతున్నా, వాస్తవానికి జిహెచ్ఎంసి , సైబరాబాద్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పనుల ప్రక్రియ నెమ్మదిగా సాగడం, మరమ్మతులకు వాడే క్వాలిటీ మెటీరియల్ లోపించడం వల్ల వాన పడగానే వేసిన ప్యాచ్ వర్క్‌లు కొట్టుకుపోయి రోడ్లు మళ్లీ అధ్వానంగా తయారవుతున్నాయి.ఇంతటి తీవ్రమైన సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమర్థవంతంగా హ్యాండిల్ చేయలేకపోవడానికి ప్రధానంగా సమన్వయ లేమి కారణం. ట్రాఫిక్ పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మంజీరా డిజైన్ టీమ్‌లు, రహదారుల నిర్మాణ సంస్థల మధ్య ముందస్తు ప్రణాళికలు ఉండటం లేదు. ఒకరు రోడ్డు వేస్తే, మరొకరు కేబుల్స్ లేదా పైప్‌లైన్ల కోసం దాన్ని తవ్వేస్తున్నారు. పైగా మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వర్క్ స్పేస్ అంచనా వేసి రాత్రి వేళల్లో వేగంగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పగటిపూట కూడా ఆంక్షలు విధించి సివిల్ వర్క్స్ సాగదీస్తుండటం వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కుదేలవుతోంది.రాజకీయంగానూ ఈ అంశం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓటర్లు, ఐటీ రంగానికి చెందిన ప్రొఫెషనల్స్ ప్రభుత్వం అందించే మౌలిక వసతుల పట్ల అత్యంత సున్నితంగా ఉంటారు. ఒకవైపు పన్నులు చెల్లిస్తూ, మరోవైపు రోడ్లపై గంటల కొద్దీ వేచి చూడాల్సి రావడం వల్ల పరిపాలనా వైఫల్యం అనే ముద్ర బలంగా పడే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ ట్రాఫిక్ కష్టాలను, వర్షాకాలంలో గుంతల రోడ్ల చిత్రాలను సోషల్ మీడియాలో హైలైట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు సైబరాబాద్ పరిధిలోని ఐటీ కంపెనీలతో ప్రభుత్వం చర్చించి స్టాగర్డ్ వర్కింగ్ అవర్స్.

హైబ్రిడ్ డ్రైవ్‌లను ప్రోత్స హించడంతో పాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలు ప్రజల నుంచి వస్తున్నాయి. హైద రాబాద్‌కు ట్రాఫిక్ అనేది కేవలం ఒక రవాణా సమస్య కాదు, అది నగరం ఆర్థిక పురో గతి కి, గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్‌కు ముడిపడిఉన్నఅంశం. అధికారులు మసకబారిన పాత ప్రణా ళికల ను పక్కనపెట్టి, ప్రజా ప్రతినిధులు, పోలీసు శాఖ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను ఒకే తాటిపైకి తెచ్చి యుద్ధప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ ట్రాఫిక్ గందరగోళం ప్రభుత్వం పట్ల పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తిగా రూపాంతరం చెందడం ఖాయం. భవిష్యత్ లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయవచ్చు కానీ ఇప్పుడు ప్రజలు భరించలేనంతగా కష్టపడితే ప్రభుత్వానికే ఇబ్బంది.

## సీనియర్ నటి షావుకారు జానకితీవ్ర అస్వస్తత

**చెన్నై** సీనియర్ నటి షావుకారు జానకి తీవ్ర అస్వస్తత కు గురయ్యారు. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో వెంటిలేటర్ పై నటి షావుకారు జానకి చికిత్స జరుగుతోంది.

శ్వాసకోశ సమస్యలతో ఆమె వారం రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. గత రాత్రి ఆరోగ్యం క్షీణించడంతో ఐసియూ కి తరలించారు. 95 ఏళ్ల షావుకారు జానకికి వైద్యుల ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. 1950లో షావుకారు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన జానకీ దాదాపు 400 సినిమాల్లో నటించారు.

## బావిలోకి దూసుకెళ్లిన కారు

**సిద్దిపేట** దుబ్బాక మండలం అప్పనపల్లిలో బుధవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది ఈ దారుణ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలతో పాటు వారి ఇద్దరు చిన్న పిల్లలు దుర్మరణం పాలయ్యారు మృతులను బలవంతపూర్ గ్రామానికి చెందిన భాగ్య, రాజు దంపతులు మరియు వారి పిల్లలు నియాన్ష్, శాన్వికగా పోలీసులు గుర్తించారు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో బలవంతపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి



## జూరాల ప్రాజెక్టుపై రోడ్డు ప్రమాదం

**మహబూబ్ నగర్** జూరాల ప్రాజెక్టుపై రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు యువకులు ఒకే బైక్పై అతివేగంగా వచ్చి స్పీడ్ బ్రేకర్ని ఢీకొట్టింది. బైకు అదుపుతప్పి పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు యువకులు బాలానగర్ మండలానికి చెందిన వారుగా గుర్తించారుర.

## పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా..
## జీఓను రద్దు చేయాలని డిమాండ్






**భద్రాద్రి న్యూస్** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ (ఎఎ), స్కిల్ యూనివర్సిటీలలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన 'శక్తి స్కీమ్' మరియు సంబంధిత జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధిర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి మధిర పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ఇతర సంస్థల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 'శక్తి స్కీమ్'ను, సంబంధిత జీఓను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ ఆందోళనలో విద్యార్థులు, ఎస్ ఎఫ్ ఐ నాయకులు పాల్గొన్నారు

## సాతానిగూడెంలో ముమ్మరంగా
## పారిశుధ్య పనులు

### పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్?



**కామేపల్లి,** పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం భద్రంగా ఉంటుందని, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య ధ్యేయమని సాతానిగూడెం గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్ తెలిపారు. మండల పరిధిలోని సాతానిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు.ఈ పారిశుధ్య పనులను గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్, పంచాయతీ కార్యదర్శి లావణ్య దగ్గరుండి పర్యవేక్షించారు.?ఈ సందర్భంగా కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు,డ్రైనేజీల్లో నీరు సజావుగా సాగేలా మల్టీపర్పస్ వర్కర్లతో ప్రత్యేకంగా పూడిక తీత పనులను చేపట్టారు.ఈ పనులను పరిశీలించిన అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ. డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యగా ఈ పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టినట్లు తెలిపారు.కాలనీలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.?గ్రామంలో ఎదురవుతున్న ప్రాథమిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి,వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను వీధుల్లో వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మరణించిన
## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

దేవులవాడ గ్రామానికి చెందిన అసంపల్లి చిన్నయ్య ఇటువలె అనారోగ్యం మరణించిన నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ సర్పంచ్ దుర్గం సమ్మక్క, ఆసరేల్లి తిరుపతి కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు గార్ల ఆధ్వర్యంలో 4000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు, కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆసరెల్లి లక్ష్మణ్ , మంచినీళ్ల స్వామి, ఆసంపల్లి శేఖరు, ఆసంపల్లి రాజ్ కుమారు, సెగం రవికుమార్ ,బుడే శ్యామ కుమార్ , కొటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు.

## వినుకొండలో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన బొలెరో వాహనం
- ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం

**పల్నాడు జిల్లా** వెల్లటూరు రోడ్డులోని హనుమాన్ నగర్ దగ్గర గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు వల్లూరి రవి (58), వల్లూరి సావిత్రి (55)గా గుర్తించారు. మిద్దె బావి కాలనీలోని కూతురి ఇంటి నుంచి బైక్పై వస్తుండగా ప్రమాదం జరిగింది. బొలెరో ఢీకొనడంతో బైక్పై ఉన్న దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సావిత్రి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు..
# శాఖల సమన్వయమే కీలకం





తిరుమల(ప్రశ్న న్యూస్) అధిక మాసం కారణంగా ఈ ఏడాది తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖలు సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నాయి. సెప్టెంబరులో సాలకట్ల, అక్టోబరులో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నందున అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర సూచించారు.గురువారం తిరుమల అన్నమయ్య భవన్‌లో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడులతో కలిసి ఈవో సమన్వయ సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అదనపు ఈవో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

### గరుడసేవపై ప్రత్యేక దృష్టి

బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తిరుమలతో పాటు తిరుపతిలోనూ భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల రథసప్తమి సందర్భంగా సుమారు 3.75 లక్షల మంది భక్తులు, 15 వేల వాహనాలు తరలివచ్చిన నేపథ్యంలో ఈసారి మరింత ముందస్తు అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు.

### 10 లక్షల లడ్డూల బఫర్ స్టాక్

భక్తులకు నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించడంతో పాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా సిద్ధంగా ఉంచాలని ఈవో ఆదేశించారు. గరుడసేవ రోజున భారీగా వచ్చే భక్తుల కోసం అదనపు వంటశాలలు, నిత్యావసర సరుకుల సేకరణ, రవాణా ఏర్పాట్లు చేపడుతున్నారు. గత బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున సుమారు 20 లక్షల ఫుడ్ పోర్షన్లు, వివిధ పానీయాలతో పాటు 15 రకాల మెనూలను అందించిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు.

### భద్రత.. ట్రాఫిక్‌పై ప్రత్యేక ప్రణాళిక

భక్తుల భద్రతకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నారు. పోలీసు శాఖ నుంచి అవసరమైన సిబ్బంది నియామకం, వారికి వసతి, విధుల కేటాయింపుపై ప్రణాళిక రూపొందించారు. టీటీడీ విజిలెన్స్, సీవీఎస్వో విభాగాలు గత అనుభవాలను విశ్లేషించి భద్రతా సిబ్బంది మోహరింపుపై నిర్ణయాలు తీసుకున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపేలా చర్యలు తీసుకోనున్నారు.

### అత్యవసర సేవలకు సన్నద్ధం

విపత్తు, సంక్షోభ నిర్వహణతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, అన్నప్రసాదం, ఘాట్‌రోడ్ల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

### 25 రాష్ట్రాల నుంచి కళాబృందాలు

బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దేశంలోని 25 రాష్ట్రాల నుంచి 27 కళాబృందాలు పాల్గొననున్నాయి.

వీటిలో రెండు విదేశీ కళాబృందాలు కూడా ఉన్నాయి. ఎస్వీబీసీ, సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా బ్రహ్మోత్సవాల విశేషాలను కోట్లాది మంది భక్తులకు చేరేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు.

### సెప్టెంబర్ 14లోగా పనులు పూర్తి

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని సమీక్షించిన అధికారులు, మిగిలిన పనులను సెప్టెంబర్ 14లోగా పూర్తి చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. అనంతరం ఈవో అధికారులతో కలిసి శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధులను పరిశీలించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.
అన్ని శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ పరస్పర సమన్వయంతో ఒకే బృందంగా పనిచేస్తేనే బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించగలమని అధికారులు స్పష్టం చేశారు.

# అమ్మవారి ఆభరణాలకే రక్షణ లేదా.?

**- ఎదకాకాని ఆలయంలో వరుస ఘటనలపై భక్తుల్లో ఆగ్రహం - రూ.10 లక్షల విలువైన తాళిబొట్టు గొలుసు మాయం.?**

**- గతంలో వడ్డాణం అదృశ్యం.. మళ్లీ అదే తరహా ఘటనతో కలకలం**

గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెదకాకాని ఆలయంలో అమ్మవారి ఆభరణాల భద్రతపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అమ్మవారికి సంబంధించిన సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు తాళిబొట్టు గొలుసు కనిపించకుండా పోయినట్లు సమాచారం బయటకు రావడంతో ఆలయ వర్గాల్లోనే కాకుండా భక్తుల్లోనూ తీవ్ర కలకలం రేగింది. ఇప్పటికే అమ్మవారి వడ్డాణం అదృశ్యమైన ఘటన చోటుచేసుకోవడం, అనంతరం భక్తుల విరాళాలతో కొత్త వడ్డాణాన్ని తయారు చేయించడం తెలిసిందే. తాజాగా మరో బంగారు ఆభరణం మాయమైనట్లు సమాచారం వెలుగులోకి రావడంతో ఆలయ భద్రతా వ్యవస్థపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి అమ్మవారి ఆభరణాలు భక్తుల విశ్వాసానికి ప్రతీకలు. కోట్లాది మంది భక్తుల నమ్మకంతో ముడిపడిన దేవాలయంలో స్వామి, అమ్మవార్లకు సమర్పించే బంగారు, వెండి ఆభరణాలకు పకడ్బందీగా లెక్కలు, రికార్డులు, భద్రతా చర్యలు ఉండాల్సిన అవసరం ఉంది. అయితే పెదకాకాని ఆలయంలో వరుసగా ఆభరణాలు కనిపించకుండా పోతున్నాయన్న ఆరోపణలు రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



### రూ.10 లక్షల తాళిబొట్టు గొలుసు ఎక్కడ.?

తాజాగా అమ్మవారి బంగారు తాళిబొట్టు గొలుసు కనిపించకుండా పోయినట్లు సమాచారం. దీని విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని భక్తుల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అసలు ఆభరణం ఎంత బరువు? దాని విలువ ఎంత? ఎప్పుడు చివరిసారిగా అమ్మవారికి అలంకరించారు? ఆ తర్వాత ఎవరి ఆధీనంలో ఉంది? ఎప్పుడు గుర్తించారు.? వంటి కీలక ప్రశ్నలకు అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది ఆభరణం మాయమైన విషయం ఆలయ అధికారులు గుర్తించారా? లేక అర్చకుల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఈ విషయం బయటకు వచ్చిందా.? అన్న అంశాలపైనా భక్తుల్లో చర్చ సాగుతోంది. అధికారిక విచారణ పూర్తయ్యే వరకు ఏ ఒక్కరిపై ఆరోపణలు చేయడం సరికాదని కొందరు చెబుతున్నప్పటికీ, ఘటనపై పారదర్శక దర్యాప్తు మాత్రం తప్పనిసరి అని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### గతంలో వడ్డాణం అదృశ్యం.. మళ్లీ తాళిబొట్టు

తాజా ఘటనను మరింత తీవ్రంగా పరిగణించాల్సిన కారణం గతంలో అమ్మవారి వడ్డాణం కూడా కనిపించకుండా పోయిందన్న ఆరోపణలు. వడ్డాణం మాయమైన తర్వాత భక్తుల విరాళాలతో కొత్త వడ్డాణాన్ని చేయించారని సమాచారం. ఆ ఘటనపై అప్పట్లోనే భక్తుల్లో ఆందోళన వ్యక్తమైనట్లు తెలుస్తోంది అయితే గత ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిగిందా? బాధ్యులెవరో తేల్చారా? ఆలయ ఆభరణాల భద్రతకు సంబంధించి ఏవైనా కొత్త నిబంధనలు అమలు చేశారా? సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచారా? ఆభరణాల రిజిస్టర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చాయి.

### మూడుసార్లు ఇలాంటి ఘటనలంటూ భక్తుల ఆరోపణలు

ఆలయంలో ఇలాంటి ఘటనలు ఒక్కసారి మాత్రమే కాకుండా మూడుసార్లు చోటుచేసుకున్నట్లు కొందరు భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే విషయం మరింత తీవ్రమైనదే. వరుస ఘటనలు జరుగుతున్నా భద్రతా వ్యవస్థను ఎందుకు పటిష్ఠం చేయలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి అమ్మవారి ఆభరణాల నిర్వహణలో ఎవరు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు? ఆభరణాలను భద్రపరిచే గది తాళాలు ఎవరి వద్ద ఉంటాయి? అలంకరణ సమయంలో ఆభరణాలను ఎవరు తీసుకుంటారు? తిరిగి భద్రపరిచే సమయంలో ఎలాంటి తనిఖీలు నిర్వహిస్తారు? ప్రతి ఆభరణానికి ప్రత్యేక రిజిస్టర్ ఉందా? ఆభరణాల బరువును క్రమం తప్పకుండా ధ్రువీకరిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉంది.

### అర్చకుల మధ్య వివాదమే కారణమా.?

అర్చకుల మధ్య కొంతకాలంగా నెలకొన్న వివాదాల నేపథ్యంలో ఆభరణం మాయమైన విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వివాదానికి, ఆభరణం అదృశ్యానికి ఏమైనా సంబంధం ఉందా? లేక అంతర్గత విభేదాల కారణంగా ఇంతకాలం బయటకు రాని అంశాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. అయితే వివాదాలు వ్యక్తిగత స్థాయిలో ఉన్నా, వాటి ప్రభావం ఆలయ పరిపాలనపై పడకూడదని భక్తులు అంటున్నారు. ఆలయ ఆస్తులు, హుండీ సొమ్ము, బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు వంటి వాటి విషయంలో వ్యక్తిగత వివాదాలకు ఎలాంటి అవకాశం లేకుండా స్పష్టమైన విధానాలు ఉండాలని కోరుతున్నారు.

### భక్తుల కానుకలకు లెక్కలేవా?

దేవాలయానికి భక్తులు సమర్పించే ప్రతి కానుక వెనుక వారి విశ్వాసం ఉంటుంది. ఒక్క గ్రాము బంగారం అయినా, చిన్న కానుక అయినా భక్తి భావంతోనే సమర్పిస్తారు. అలాంటి ఆభరణాలు మాయమయ్యాయన్న వార్తలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తాయి. అందువల్ల ఆలయంలో ఉన్న మొత్తం బంగారు, వెండి ఆభరణాల జాబితాను సిద్ధం చేసి, వాటి బరువులు, నమూనాలు, ఫొటోలు, రిజిస్టర్ వివరాలు, భద్రపరిచే విధానం తదితర అంశాలను పునఃపరిశీలించాలని భక్తులు కోరుతున్నారు. ఆభరణాల లెక్కలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించి వాస్తవాలను భక్తుల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

### సీసీ కెమెరాలు ఉన్నా.. భద్రతపై అనుమానాలెందుకు.?

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న సమయంలో దేవాలయంలోని కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి. ఆభరణాలు ఉంచే ప్రాంతం, అమ్మవారికి అలంకరణ చేసే ప్రదేశం, గర్భాలయ పరిసరాలు, భద్రతా గదులు, ప్రవేశ ద్వారాలు వంటి ప్రాంతాల్లో కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలి. తాళిబొట్టు గొలుసు చివరిసారిగా కనిపించిన సమయం నుంచి అది మాయమైన విషయం గుర్తించిన సమయం వరకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే కీలక ఆధారాలు లభించే అవకాశం ఉంది. సంబంధిత ఫుటేజీని అధికారులు భద్రపరచి, అవసరమైతే పోలీసులకు అందించాల్సి ఉంటుంది.

### భక్తుల విశ్వాసాన్ని కాపాడాలి

దేవాలయం అంటే కేవలం ఒక భవనం కాదు.. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి నిలయం. అమ్మవారి ఆభరణాల భద్రతలో చిన్న లోపం జరిగినా దాని ప్రభావం ఆలయ ప్రతిష్ఠపై పడుతుంది. వరుసగా ఆభరణాలు మాయమవుతున్నాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అత్యంత పారదర్శకంగా విచారణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.తాజా తాళిబొట్టు ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను నిగ్గు తేల్చాలి. గతంలో మాయమైనట్లు చెబుతున్న వడ్డాణం సహా ఆలయంలోని అన్ని విలువైన ఆభరణాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి. బాధ్యతల్లో ఎక్కడైనా లోపం తేలితే సంబంధిత వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.అమ్మవారి ఆభరణాల విషయంలో 'మాయమైంది' అనే మాటకు ఇక చోటుండకూడదని భక్తులు స్పష్టం చేస్తున్నారు. భక్తుల విశ్వాసానికి భంగం కలగకుండా ఆలయ అధికారులు ప్రతి ఆభరణానికి పకడ్బందీ లెక్కలు, భద్రతా వ్యవస్థ, సీసీ కెమెరాల నిఘా, బాధ్యతల విభజనను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది. అసలు తాళిబొట్టు గొలుసు ఏమైంది? గతంలో మాయమైన వడ్డాణం వ్యవహారం ఎక్కడ వరకు వచ్చింది? ఇలాంటి ఘటనలు ఎన్నిసార్లు జరిగాయి? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

## బద్వేలు తెలుగుదేశం పార్టీ
## కార్యాలయంలో ప్రజాదర్బార్

**- బద్వేలు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి**




**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కార్యాలయంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. బద్వేలు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.×ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## చందర్లపాడు మండలం తోర్లపాడు గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించిన నందిగామ రూరల్ సి.ఐ వై.వి ఎల్ నాయుడు



నందిగామ రూరల్ సి.ఐ వై.వి ఎల్ నాయుడు తోర్లపాడు గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి వారంలో ఒకరోజు ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామ ప్రజలతో మమేకమై గ్రామంలోని పలు సమస్య ల్ని తెలుసు కొ ని వాటిని పరిష్కరించే దిశగా అడుగు లు వేయటం కోసం ఈ పల్లెనిద్ర కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు పోలీసులు సిద్ధమవుతూ శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా ముఖ్యంగా సమస్యాత్మకమైన గ్రామాలను లక్ష్యంగా నిఘాను మరింత పటిష్టం చేసింది దీనిలో భాగంగానే తొర్లపాడు గ్రామంలో పల్లెనిద్ర నిర్వహించి గ్రామ ప్రజలతో పలు విషయాలు చర్చించిఅనుమాన వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలోని గ్రామ ప్రజలు ఉండాలని తెలిపారు సీఐ వై.వి.ఎల్ నాయుడు. ఈ కార్యక్రమంలో ఎస్సై ధర్మరాజు పాల్గొన్నారు.

## అప్పన్న కోసం గాలింపు చర్యలు
## ముమ్మరం చేయాలి

**విజయవాడ** గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు హోంమంత్రి అనిత ఆదేశించారు. ఈ నెల 16న వేటకు వెళ్లిన 8 మంది మత్స్యకారుల్లో ఒకరు గల్లంతు అయ్యారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని హోంమంత్రి అనిత సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. బాధిత మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.. గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు.

## పుష్కరాల కోసం మున్సిపల్ శాఖకు
## ఆర్థిక శాఖ రూ.150 కోట్లు కేటాయింపు

**- మంత్రి నారాయణ**

**అమరావతి** శాసనమండలిలో 'గోదావరి పుష్కరాల నిధుల'పై ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. రాబోయే గోదావరి పుష్కరాల కోసం మున్సిపల్ శాఖకు ఆర్థిక శాఖ రూ.150 కోట్లు కేటాయించింది. కేంద్రం నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఇప్పటికే లేఖ రాసారు. ఇవి గాకుండా జఎఆఈ, జఅఈ వంటి పథకాల ద్వారా పుష్కరాలు జరిగే ప్రాంతాల మునిసిపాలిటీలకు రూ.1,144 కోట్లు కేటాయించామని అన్నారు.

## రూ.12 లక్షల చెత్త సంపద కేంద్రాలు వృథా

**-సి.బెళగల్, ఆగస్టు 20** : సి.బెళగల్ మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో సుమారు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూఎం కేంద్రాలు) నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి, వ్యర్థాలను పునర్వినియోగం ద్వారా సంపదగా మార్చాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ కేంద్రాలు ప్రస్తుతం వినియోగానికి నోచుకోకపోవడంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లక్షల రూపాయల ప్రజాధనంతో భవనాలు నిర్మించినప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయి చాలాకాలం గడుస్తున్నా చెత్త సేకరణ, వేరు చేయడం, తడి?పొడి వ్యర్థాల నిర్వహణ వంటి ప్రక్రియలు సక్రమంగా కొనసాగకపోవడంతో కేంద్రాల ఉద్దేశమే నీరుగారుతోందని వారు అంటున్నారు.గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం కారణంగా నిర్మించిన మౌలిక వసతులు ప్రజలకు ఉపయోగపడటం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు పనిచేస్తే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు వ్యర్థాలను సక్రమంగా నిర్వహించే అవకాశం ఉంటుందని, అయితే ప్రస్తుతం కేంద్రాలు మూతపడటంతో గ్రామాల్లో చెత్త సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదని పేర్కొంటున్నారు.ప్రజాధనంతో నిర్మించిన కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడంపై సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణాలకు నిధులు ఖర్చు చేసిన తర్వాత వాటి నిర్వహణ, సిబ్బంది ఏర్పాటు, చెత్త సేకరణ వ్యవస్థ అమలు, తడి?పొడి చెత్త వేరు చేసే ప్రక్రియపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా కేంద్రాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, నిర్మించిన మౌలిక వసతులు ఎందుకు వినియోగంలోకి రాలేదనే అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# లక్షల్లో నష్టపోయాను ..

## మళ్లీ మా ఊరెళ్లిపోవాలనిపిస్తుంది:నటుడు అంజిమామ!

'మా విలేజ్ షో' నుంచి పాపులర్ అయిన నటుడే అంజిమామ. తనదైన యాసతో చాలా సహజంగా నటించే అంజిమామ, ఆడియన్స్ కి చాలా త్వరగా కనెక్ట్ అవుతూ ఉంటాడు. అలాంటి అంజిమామ తాజాగా 'ఐ డ్రీమ్'వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన గురించిన అనేక విషయాలను ప్రస్తావించాడు." కష్టపడటం నాకు మొదటి నుంచి అలవాటే. ప్లంబర్ గా .. ఎలక్ట్రీషియన్ గా .. ఆర్ ఎంపీ గా డాక్టర్ పనిచేశాను. ఆ తరువాత వాటర్ ప్లాంట్ పెట్టాను. అయినా ఎక్కడా నిలదొక్కుకోలేకపోయాను" అని అన్నారు. "ఆ తరువాత స్నేహితులతో కలిసి ఈజీమని కోసం ఒక స్కీమ్ లో పెట్టుబడి పెట్టాను. దాంతో 24 లక్షల నష్టం వచ్చింది. మంచి జీవితం కోసం .. త్వరగా ఎదగాలనే కోరికతో ఈజీమని దిశగా ఆలోచన చేయడం జరిగింది. కానీ అనుభవంతో చెబుతున్నాను. ఈజీమని దిశగా ఎవరూ వెళ్లకూడదు. ఆ దిశగా ఎవరినీ ఎంకరేజ్ చేయకూడదు. ఆ ఎఫెక్ట్ కారణంగా జీవితంలో నేను మరిన్ని కష్టాలు పడవలసి వచ్చింది" అని ఆయన చెప్పారు. " ఒక వైపున నటుడిగా నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తూనే, మరో వైపున హైదరాబాద్ లో క్యాబ్ నడుపుతున్నాను. ఎందుకంటే నెల కాగానే ఇంటికి 50 వేలు పంపించవలసి ఉంటుంది. క్యాబ్ నడిపేటప్పుడు మాస్క్ పెట్టుకున్నా నన్ను కొంతమంది గుర్తుపడుతున్నారు. ఈ కష్టాలన్నీ ఎందుకు .. నా ఊరెళ్లిపోవాలని అనిపిస్తుంది. ఒక ఎకరం పొలం .. నాలుగు బర్రెలు ఉంటే హాయిగా బ్రతకొచ్చని అనిపిస్తుంది" అంటూ ఆయన ఉద్వేగానికి లోనయ్యారు.

## 'ఇరుముడి' విషయంలో

# మ్యూజిక్ జరిగింది

'మ్యూజిక్ కంపోజింగ్ విషయంలో నేను సినిమా కథకు చాలా ప్రాధాన్యతనిస్తా. కథ మొత్తం విన్న తర్వాత దానికి ఎలాంటి సంగీత ప్రపంచాన్ని సృష్టించాలనేది ఆలోచిస్తాను. 'ఇరుముడి' కథలో భక్తి, సైకాలజీ, క్రైమ్, ఫ్యామిలీ సెంటిమెంట్..ఇలా అన్ని అంశాలున్నాయి. ఇలాంటి సినిమాకు సంగీతాన్నందించడం పెద్ద సవాలు' అన్నారు ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్‌కుమార్. ఆయన స్వరాల్ని అందించిన తాజా చిత్రం 'ఇరుముడి' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. బుధవారం జీవీ ప్రకాష్‌కుమార్ విలేకరులతో సినిమా సంగీత విశేషాలను పంచుకున్నారు.



## మహిళలకు స్ఫూర్తినిస్తుంది..

# వేదా జలంధర్



'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రానా 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కుసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా రిలీజైన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుతారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది.



## రజినీకాంత్ 'జైలర్ 2'

# ఫస్ట్ సింగిల్ అప్‌డేట్..

## 'అలా బోలెలో' ప్రోమో రిలీజ్!

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ చిత్రం 'జైలర్ 2' . బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సినిమాలోని మొదటి పాట 'అలా బోలెలో'ను ఆగస్టు 21న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు సన్ పిక్చర్స్ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు తాజాగా పాటకు సంబంధించిన ప్రోమో వీడియోను విడుదల చేసింది. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఈ పాటపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజినీకాంత్ మరోసారి పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో అలరించనున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.

## ఓటీటీ స్క్రీన్‌పైకి

# విశాల్ యాక్షన్ థ్రిల్లర్!



విశాల్ కి మొదటి నుంచి కూడా మాస్ ఇమేజ్ ఎక్కువ. తమిళనాట మాత్రమే కాదు, తెలుగులోను ఆయనకి మాస్ ఫ్యాన్స్ ఎక్కువే. విశాల్ తన సినిమాలలో యాక్షన్ .. ఎమోషన్ రెండూ ఉండేలా చూసుకుంటాడు. మాస్ టచ్ తో సాగే ఆయన సినిమాలకు ఓటీటీలలోను మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో రీసెంటుగా ఆయన చేసిన ఒక సినిమా 'అమెజాన్ ప్రైమ్' ఓటీటీ వేదికపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఆ సినిమా పేరే 'మకుటం'. ఆగస్టు 14న విడుదలైన ఈ సినిమా, సెప్టెంబర్ 4 నుంచి ఓటీటీ ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. విశాల్ కి మాస్ యాక్షన్ సినిమాలు చేసిన అనుభవం పుష్కలంగా ఉంది. అలాగే కథ .. స్క్రీన్ ప్లే విభాగాలపై కూడా ఆయనకి అవగాహన ఉంది. అందువలన ఆయన దర్శకుడిగా మారిపోయి తెరకెక్కించిన సినిమా ఇది. ఇక ఈ సినిమాలో ఆయన తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయడం మరో విశేషం. ఈ రెండు పాత్రల సరసన నాయికలుగా అంజలి – దుషారా విజయన్ అలరించారు.

జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందనే టాక్ వచ్చింది. కథలోకి వెళితే .. కృపాకర్ ఒక చిన్నపాటి జాబ్ చేసుకుంటూ, భార్యాపిల్లలతో ఆనందంగా గడుపుతూ ఉంటాడు. ఒకసారి సరదాగా వాళ్లను తీసుకుని విహారానికి వెళతాడు. అక్కడ కొంతమంది రౌడీలు అతని కారుపై దాడి చేస్తారు. ఆ ఘటనలో కృపాకర్ భార్యాబిడ్డలు చనిపోతారు. అప్పుడు కృపాకర్ ఏం చేస్తాడు? అతని ఫ్యామిలీపై దాడి చేసింది ఎవరు? ఆ గ్యాంగ్ వెనకున్న నాయకుడు ఎవరు? అనేది మిగతా కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఎన్ని మార్కులు కొడుతుందో చూడాలి మరి.

# గ్రాండ్‌గా లాంచ్ అయిన 'మోడ్రన్ మిస్సమ్మ' ఫస్ట్ సింగిల్

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మోడ్రన్ మిస్సమ్మ'. హర్ష నర్రా, తన్మయి ఖుషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ సింగిల్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో అత్యంత వైభవంగా జరిగింది. లాస్య అండ్ మిధున క్రియేషన్స్ పతాకంపై చిరంజీవి పమిడి, శివ పమిడి, కిరణ్ కుమార్ నల్లూరి, స్రవంతి నంబూరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రానికి సాయిబాబా కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు గోపీ సుందర్ స్వరాలు సమకూర్చగా, గీత రచయిత కిట్టు విస్సప్రగడ ఆకట్టుకునే సాహిత్యమందించిన 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' మొదటి పాటను మేకర్స్ విడుదల చేశారు. ట్రెడిషనల్ లుక్‌లో హీరో హీరోయిన్లు కనిపించిన ఈ పాట మహిళలను ఎంతగానో ఆకట్టుకునేలా ఉందని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ వేడుకలో చిత్ర బృందం మాట్లాడుతూ సినిమాపై తమ అంచనాలను పంచుకున్నారు.ఈ సినిమాను చూసిన ప్రతి ఒక్కరూ చక్కగా ఎంజాయ్ చేస్తారని 'వదల' చిత్ర నిర్మాత కిశోర్ నాయుడు ప్రశంసించారు. ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు లాగే సినిమా చేసి చూడు అనడంలో ఎంతో అర్థం ఉందని దర్శకుడు సాయిబాబా తెలిపారు. రెండేళ్ల ప్రయాణం తర్వాత ట్రెండ్‌కు తగ్గట్టుగా, అందరికీ రిలేట్ అయ్యేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు. ఈ చిత్రంలో సిజు ఏఆర్, ప్రమోదిని, హారిక, డా. భద్రం, శివన్నారాయణ, రాకేష్ రాచకొండ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.వీశీజఐవం



# షూటింగ్ ఆపేశారు..

## రూ.1.32 కోట్లు చెల్లించిన రాంగోపాల్ వర్మ!

తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టెక్నీషియన్ల బకాయిలను ఎట్టకేలకు దర్శకుడు రాంగోపాల్ వర్మ చెల్లించారు. తన కొత్త సినిమా 'పోలీస్ కంపెనీ' షూటింగ్‌ను సినీ కార్మికుల సంఘం అడ్డుకోవడంతో రూ.1.32 కోట్ల బకాయిలను చెల్లించినట్లు సమాచారం. పూర్తి మొత్తాన్ని అందుకున్న తర్వాతే షూటింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) తెలిపింది. సర్కార్, సర్కార్ 3 సహా పలు సినిమాలకు పనిచేసిన టెక్నీషియన్లకు వర్మ బకాయిలు చెల్లించాల్సి ఉందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ అధ్యక్షుడు బీఎన్ తివారీ తెలిపారు. కొన్నేళ్లుగా డబ్బు చెల్లిస్తానని హామీలు ఇచ్చినా.. ఆచరణలో మాత్రం జరగలేదని ఆరోపించారు. 2019లో పూర్తి మొత్తాన్ని చెల్లిస్తానంటూ వర్మ లేఖ కూడా పంపారని చెప్పారు. తర్వాత ఆఫీసు మూసేసి అందుబాటులో లేకుండా పోయారని తివారీ ఆరోపించారు. గోవాలో కనిపించినప్పుడు బకాయిలు చెల్లిస్తానని చెప్పారని.. తర్వాత హైదరాబాద్‌కు వచ్చి చిన్న సినిమాలు చేస్తున్నారని తివారీ పేర్కొన్నారు. అయితే ఈసారి 'పోలీస్ కంపెనీ' షూటింగ్ ప్రారంభం కాకుండా అడ్డుకోవడంతో వర్మపై ఒత్తిడి పెరిగిందని అన్నారు. కొందరు ప్రముఖులు జోక్యం చేసుకున్న తర్వాత పూర్తి మొత్తాన్ని చెల్లించారని తెలిపారు.హర్షవర్ధన్ రాణే ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'పోలీస్ కంపెనీ'.. ముంబై అండర్‌వరల్డ్ నేపథ్యంలో రూపొందుతోంది.



# మళ్లీ తన మార్క్ కామెడీతో అల్లరి నరేశ్..

## 'రంభ ఊర్వశి మేనక' నుంచి కొత్త పాట

కామెడీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో అల్లరి నరేశ్, చాలా కాలం తర్వాత మళ్లీ తన కామెడీ జానర్‌లోకి పూర్తిస్థాయిలో వచ్చేశారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ ఫన్ ఎంటర్‌టైనర్ నుంచి చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఈ క్రమంలో సినిమా నుంచి రెండో పాట 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా'ను గురువారం విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలోని పాట వినసొంపుగా ఉండటమే కాకుండా, సినిమా కథా నేపథ్యాన్ని తెలియజేసేలా ఉంది. ముఖ్యంగా 'వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం' వంటి చరణాలు సినిమాలోని హాస్యభరిత సన్నివేశాలపై అంచనాలను పెంచుతున్నాయి. పేదరికం, కుటుంబ సమస్యల చుట్టూ అల్లరి నరేశ్ మార్క్ కామెడీ ఏ స్థాయిలో ఉండబోతోందో ఈ పాట స్పష్టమైన హింట్ ఇస్తోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన అల్లరి నరేశ్, ఈ చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలో ఆయనకు జోడీగా కథానాయిక సురభి నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఆన్–స్క్రీన్ కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రం కచ్చితంగా కుటుంబ ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని, నరేశ్ పాత కామెడీ టైమింగ్‌ను అభిమానులు మళ్లీ చూస్తారని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, 'రంభ ఊర్వశి మేనక' చిత్రాన్ని సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులపై జోనల్ కమిషనర్ పరిశీలన



కీసర( ప్రశ్న న్యూస్) నగరంలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిని పరిశీలించేందుకు జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వాల్ (ఐఏఎస్ ), డీఈ మాధవ చారి, ఏఈ మధురిమలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా దమ్మైగూడ డివిజన్ లోని సాయిరాం కాలనీ, ఎంబీఆర్ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ, ప్రగతి నగర్ కాలనీ, శివానందపురి కాలనీ, లక్ష్మీ గణపతి కాలనీ, భవానీ శంకర్ కాలనీ, త్రిశూల్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు.స్థానికంగా ఉన్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలను కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముప్పా రామారావు, నరేందర్ రెడ్డి, సామల శ్రీనివాస్ రెడ్డి, తదితరులతో పాటు కాలనీ వాసులు ఈ పరిశీలన కార్యక్రమంలో పాల్గొని ఆయా ప్రాంతాల సమస్యలను వివరించారు.స్థానికుల సమస్యలను పరిశీలించిన అధికారులు అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని సూచించారు.

# అహ్మద్‌గూడ పాత గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి వినతి

**- పాడైన పైప్‌లైన్‌తో ప్రజలకు ఇబ్బందులు..**

**- త్వరలో సమస్య పరిష్కరిస్తామని హెచ్.ఎం డబ్ల్యూఎస్ హామీ**



కీసర( ప్రశ్న న్యూస్) మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని అహ్మద్‌గూడ పాత గ్రామంలో పాడైన పైప్‌లైన్ కారణంగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ హెచ్ ఎం డబ్ల్యు ఎస్ దమ్మాయిగూడ మేనేజర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మేనేజర్ మల్లికార్జున్ సమస్యను పరిశీలించి త్వరితగతిన మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్త భాస్కర్ గౌడ్, బోయిని రాజు, సందని ప్రవీణ్, సందని శ్రీరాములు పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ వివక్ష

**- తెలంగాణలో చేపట్టిన పనులకు డెడ్‌లైన్ ప్రకటించాలి**

**- ఎన్.సి. సంతోష్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపకుండా, దక్షిణ తెలంగాణతో సమాంతరంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని గజ్వేల్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎన్.సి. సంతోష్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాంతీయ వైషమ్యాలను వీడి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.ఈ సందర్భంగా ఎన్.సి. సంతోష్ మాట్లాడుతూ తెలంగాణలో హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్, ఆదిలాబాద్ వంటి కీలక ప్రాంతాలు ఉత్తర తెలంగాణలో ఉన్నాయని, దక్షిణ తెలంగాణలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, నల్గొండ, వికారాబాద్, తాండూర్ వంటి ముఖ్య ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిలో ప్రాంతీయ వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు.ప్రభుత్వం ప్రతిపాదించిన 30 వేల ఎకరాల ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును దక్షిణ తెలంగాణలోనే ఏర్పాటు చేస్తున్నారని, ఉత్తర తెలంగాణ భవిష్యత్తు, అభివృద్ధిపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణ తెలంగాణకు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించేందుకు ఎంత ఖర్చయినా భరిస్తామని ప్రభుత్వం చెబుతుండటం మంచిదేనని, అయితే ఉత్తర తెలంగాణకు జీవధారగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును 'కూలేశ్వరం' అంటూ విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉదాసీనత కారణంగానే పనులు ముందుకు సాగడం లేదని సంతోష్ విమర్శించారు. ఉత్తర తెలంగాణకు కీలకమైన ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, పనుల ప్రారంభానికి డెడ్‌లైన్ వెల్లడించాలని కోరారు.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తిచేసి విమానాల రాకపోకలు ప్రారంభించిన నేపథ్యంలో, తెలంగాణలోని వరంగల్ విమానాశ్రయం అభివృద్ధిపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.దక్షిణ తెలంగాణ అభివృద్ధితో పాటు ఉత్తర తెలంగాణను కూడా సమాంతరంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి ఒక నిర్దిష్ట ప్రాంతానికి మాత్రమే కాకుండా యావత్ తెలంగాణకు ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎన్.సి. సంతోష్ డిమాండ్ చేశారు.

# బావిలోకి దూసుకెళ్లిన కారు.. ఒకే కుటుంబంలో నలుగురు జల సమాధి



సిద్దిపేట(ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దుబ్బాక మండలం అప్పన్నపల్లి గ్రామ శివారులో ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోతైన బావిలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉండటంతో బల్వంతపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.దుబ్బాక మండలం బల్వంతపూర్‌కు చెందిన దండుగుల రాజు (30) ఇసుక వ్యాపారం చేస్తుంటాడు. రాజు తన భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్స్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి బుధవారం సిద్దిపేటలో బంధువు దశదినకర్మకు హాజరయ్యారు. కార్యక్రమం ముగించుకుని అర్ధరాత్రి సమయంలో కారులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు.అప్పన్నపల్లి గ్రామ శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న లోతైన బావిలోకి దూసుకెళ్లినట్లు సమాచారం. ప్రమాదాన్ని కొంతసేపటి తర్వాత గుర్తించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్‌ను రప్పించి బావిలో నుంచి కారును బయటకు తీశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో రాజు, భాగ్యతో పాటు ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఒకేసారి మృత్యువాత పడటంతో బల్వంతపూర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# రాజీవ్ స్ఫూర్తితో యువత దేశ అభివృద్ధికి అంకితం కావాలి

**- దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం**

**- గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రపంచ దేశాల్లో భారత్ తలెత్తుకునేలా చేసిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుకేందర్ రెడ్డి అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల చరిత్రను ఎవరూ కనుమరుగు చేయలేరని పేర్కొన్నారు.గురువారం గజ్వేల్‌లో నిర్వహించిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి నేరుగా నిధులు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితి తగ్గింపు వంటి సాహసోపేత నిర్ణయాలు రాజీవ్ గాంధీ హయాంలో తీసుకున్నారని గుర్తు చేశారు.రాజీవ్ గాంధీ దేశంలో కంప్యూటరీకరణ, టెలికమ్యూనికేషన్ వ్యవస్థకు పెద్దపీట వేయడంతో పాటు ఐటీ, సాంకేతిక, విమానయాన, రక్షణ రంగాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఆయన తీసుకొచ్చిన సాంకేతిక సంస్కరణల ఫలితంగా నేడు భారత యువత ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుకుంటోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు నూతన సంస్కరణలకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని కించపరిచేలా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని బీజేపీ కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచనల మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణతో పాటు సామాజిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.అభివృద్ధి పేరుతో అంబానీ, అదానీలకు ప్రయోజనం చేకూర్చుతూ దేశాన్ని అధోగతి పాలు చేస్తున్న మోదీ ప్రభుత్వానికి యువత తగిన సమాధానం చెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నంగనూరి సత్యనారాయణ గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, నక్క రేగొండ గౌడ్, ఆమెరేందర్, రాములు గౌడ్, సమీర్, గాడిపల్లి శ్రీనివాస్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, నరేష్, అజార్, జాకీర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం ఇవ్వాలని టియూసిఐ ధర్నా



**ధర్పల్లి (ప్రశ్న న్యూస్ )**ధర్పల్లి కనీస వేతనం నెలకు రూ. 39,373 ఇవ్వాలని,4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టియూసిఐ జాతీయ కమిటీ పిలుపుతో సోమవారం ధర్పల్లి ఎం పి డి ఓ కార్యాలయం ముందు ధర్నా చేసి ఎం పి ఓ కి వినతిపత్రం ఇచ్చారు. టియూసిఐ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ, అవసరాల ఆధారిత కనీస వేతన చట్టం అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు పి ఎఫ్, ఇ ఎస్ ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆశన్న, సాయిలు, విలాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతి రావు బాపూలే గురుకుల పాఠశాలలో ఎంఆర్ఓ ఆకస్మిక తనిఖీ



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించిన ధర్పల్లి ఎంఆర్ఓ శాంత, ధర్పల్లి మండలంలోని జ్యోతి రావు బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం ధర్పల్లి శాంత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి గదులు,వసతి గృహం, వంటశాల, భోజనం నాణ్యత, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి చదువు, భోజనం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

# కల్లుగీత కార్మిక సంఘం సుదీర్ఘ పోరాటాల ఫలితమేట్యాంక్ బండ్ పైన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరణ

**- పెండింగ్ ఎక్స్ గ్రేషియాలు విడుదల**

**- కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీ తరుపున ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు**



ములుగు(ప్రశ్న న్యూస్) ట్యాంక్ బండ్ పైన ఆగస్టు 18 న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయటం పైన కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్బంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ హాజరు అయి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని నడిఒడ్డున సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి కి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియ చేస్తున్నాము అని అన్నారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాల ఫలితంగా నేడు ఆగస్టు 18న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానితోపాటు గత మూడు సంవత్సరాలుగా తాటి చెట్ల నుండి పడిన బాధితులకు 20 కొట్ల రూపాయాలు విడుదల చేయడం హర్శించ దగ్గ విషయం అని అన్నారు.ప్రతి సోసైటీ కి తాటి ఈత చెట్ల పెంపకం కోసం 10 ఎకరాలు భూమి ప్రభుత్వం కొని ఇవ్వాలని, రైతు బీమా లాగా గీతన్న బీమా పథకం అమలు చేసి మృతి చెందిన గీత కార్మికులకు పది లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని అన్నారు. ఏజెన్సీలో అనాదిగా కల్లు గీత వృత్తి చేస్తున్నా గీత కార్మికులకు 50 సంవత్సరాలు నిండిన వారికీ వృత్తి పింఛన్ మంజూరు చేయాలనీ రద్దు చేసిన గీత సోసైటీ లను గతం లో ముఖ్యమంత్రి మాట ఇచ్చిన ప్రకారం సోసైటీలను పునరుద్దరణ చేయాలనీ అన్నారు. ములుగు జిల్లా కేంద్రం లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలనీ అలాగే నిరా కేంద్రం ప్రారంభం చేయాలనీ జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ సంఘం సీనియర్ నాయకులు సర్పంచుల పోరం జిల్లా కన్వీనర్ ముస్నిపల్లి కుమార్ గౌడ్ నాయకులు కునూరు అశోక్ గౌడ్ సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు పులి రమేష్ గౌడ్ ములుగు మండలనాయకులు కునూరు సాగర్ గౌడ్ గుండెబోయిన శ్రీనివాస్ గౌడ్ పైడిమల్ల భరత్ గౌడ్ ఐలి దామోదర్ గౌడ్ (నాగరాజు గౌడ్) పైడి మల్ల రఘు గౌడ్ పులి ప్రకాష్ గౌడ్ చెంద్ర గిరి కుమార్ గౌడ్ తో పాటు 20 మంది గీత కార్మికులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర దొంగల అరెస్టు రిమాండుకు తరలింపు




ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) పోలీస్ స్టేషన్ పరిధిలోలో గత నెలలో కోరుట్ల పేట గ్రామానికి చెందిన తడ రాజిరెడ్డి తన అవసరాన్ని నిమిత్తం తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు వెళ్లి రూ.30,000/- విత్ డ్రా చేసుకొని తన స్కూటీలో పెట్టుకొని వస్తుండగా గమనించిన నిందితులు రాజిరెడ్డిని వెంబడించి మెడికల్ షాప్ ముందు రాజిరెడ్డి స్కూటీని పెట్టి మందులు కొనుచుంటున్నగా నిందితులు స్కూటీ డిక్కిని పగలగొట్టి అందులో నుండి రూ.30,000/- నగధు ఎత్తుకెళ్లినారు. అలాగే ఏగడండి చంద్రయ్య స్కూటి నుండి కూడా రూ.20,000/- దొంగతనం చేసినారు అని అట్టి విషయాలలో రాజిరెడ్డి, ఏగడండి చంద్రయ్య ల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన ఎల్లారెడ్డిపేట పోలీసులు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చేసుకొని నిందితులైన ఆకుల కిరణ్ అలియాస్ ఆకుల వీర కిరణ్, అతని భార్య ఆకుల సుకన్య లను గుర్తించి ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుండి దొంగలించిన సొత్తు రికవరీ చేసి రిమాండ్ కి పంపించారు. మిగతా నిందితులైన మరో నలుగురు కిరణ్ కుమార్ దోస్తులు పరారీలో ఉన్నారని, వారి కోసం వెతుకుతున్నామని, నిందితులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలలో నేరాలు చేసినారని , రాజన్న సిరిసిల్లలోని తంగళ్ళపల్లి, సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, మహబూబాద్, రామయంపేట, చేగుంట, నిర్మల్, వర్ధన్నపేట, ఇతర పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేయగా వారి మీధ దాదాపు 30 పైగా కేసులలో నేరస్తులుగా ఉన్నారు అని, నింధితుల వద్ద నుండి రూ.66,000/-, 03 మొబైల్ ఫోన్ లు, ఒక కార్ ను స్వాధీనం చేసుకున్నారని గా.వెంకటేష్, సి.ఐ ఎల్లారెడ్డిపేట సర్కిల్ తెలిపినారు. నిందితులను పట్టుకోవడం లో కృషిచేసిన ఎన్.రమేశ్ ఎస్.ఐ ఎల్లారెడ్డిపేటని, కే ఎన్. మూర్తి ఎస్.ఐ-×× ఎల్లారెడ్డిపేటని, సిబ్బంది అయిన జె.రాజేందర్, కె విజయ్, ఎస్, దిలీప్, బి.రోజా లను పోలీస్ అధికారులు అభినందించారు.

# కంట్రోల్ తప్పుతున్న కాంగ్రెస్ పార్టీ

**- రేవంత్ ఉక్కిరిబిక్కిరి - దారిలో పెట్టలేకపోతున్నారా.? - రేవంత్ రెడ్డి పైనే తిరగబడుతున్న వ్యవహారం**

**- ముఖ్యమంత్రి పైనే అనుచిత వ్యాఖ్యలు, ప్రజలు అయోమయం - కార్యకర్త నుంచి కీలక నాయకుల వ్యాఖ్యలపై క్రమశిక్షణ చర్యలు ఉండవా.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుంటూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు.

### - సీఎంనూ లెక్క చేయని సుస్మితా పటేల్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఒక కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్టానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. ఆనాడు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగుల్ లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు.

### - ధిక్కార నేతల సంఖ్య క్రమంగా పెరుగుతున్న వైనం

ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

### - ఏమీ చేయలేకపోతున్న క్రమశిక్షణా కమిటీ

మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనుకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.



# విరాళాల దోపిడీకి రామమందిర ట్రస్ట్ సరిపోలేదా?

### - పీఎం కెర్స్ నిధిపై ఖర్గే ప్రశ్నలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అయోధ్య రామమందిర విరాళాల చోరీ, పీఎం కేర్స్ నిధి వినియోగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నలు లేవనెత్తారు. పీఎం కెర్స్ నిధి, రామమందిర ట్రస్ట్ రెండూ ప్రధాని మోదీ పర్యవేక్షణలోనే ప్రకటించాయని, రెండింటికీ విరాళాలు అందుతాయని ఆయన తెలిపారు. పీఎం కేర్స్ ట్రస్టో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను ప్రస్తావిస్తూ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. ఆ ఏడాదిలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు కాగా, నిధిలో సుమారు రూ. 8,452 కోట్ల ముగింపు నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు. 2024-25లో జరిగిన ఖర్చు నిధి ముగింపు నిల్వలో కేవలం 0.01 శాతం మాత్రమేనని ఖర్గే ఎక్స్ వేదికగా ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు.

### - పీఎం పట్టించుకోరు (పీఎం డస్ నాట్ కేర్)

ప్రజా జవాబుదారీతనం లేని ప్రభుత్వ వ్యవస్థనా? విరాళాల దోపిడీకి ఒక రామమందిర ట్రస్ట్ సరిపోలేదా అన్నట్లుగా ఉంది! గుర్తుంచుకోండి మోదీ, మీరే పీఎం కెర్స్ నిధిని, రామమందిర ట్రస్ట్‌ను ప్రకటించారు. మీ పర్యవేక్షణలోనే రెండింటికీ విరాళాలు అందుతున్నాయి!" అని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పీఎం కెర్స్ నిధిలో రూ. 8,452 కోట్ల నిల్వ ఉందని ఖర్గే వెల్లడించారు. ఈ క్రమంలోనే నిధికి సంబంధించిన జవాబుదారీ విధానాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఇది ఆర్టీఐ(సమాచార హక్కు చట్టం) పరిధిలోకి రాదని, కాగ్ ఆడిట్ లేదా పార్లమెంటరీ జవాబుదారీతనానికి లోబడి లేదని ఆయన ఆరోపించారు. 2024-25లో నిధి నిల్వలో చాలా తక్కువ భాగం మాత్రమే ఖర్చయినప్పటికీ, అత్యవసర నిధిలో వేల కోట్లు ఎందుకు పోగుచేస్తున్నారని, దాని వెనుక ఉన్న కారణం ఏంటని ఖర్గే ప్రశ్నించారు.

### - నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చు : ఖర్గే

"ప్రధానమంత్రి ఈ ట్రస్టు చైర్మన్‌గా ఉన్నారు. రక్షణ, హోం, ఆర్థిక శాఖ మంత్రులు దీనికి ట్రస్టీలుగా ఉన్నారు. ఇది సిఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులు, పన్ను మినహాయింపు పొందే విరాళాలను స్వీకరిస్తుంది. ప్రధానమంత్రి పేరుతో ఉన్న ఈ నిధి సాధారణ ప్రజా పరిశీలన విధానాల పరిధిలోకి ఎందుకు రాకుండా ఉందో వివరించాలి. ప్రధానమంత్రి పేరుతో ఉన్న నిధి సాధారణ ప్రజా పరిశీలన విధానాలకు ఎందుకు అతీతంగా ఉంది? 2024-25 ఆర్థిక సంవత్సరంలో అందుబాటులో ఉన్న నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చయినప్పుడు, వేల కోట్ల రూపాయల అత్యవసర నిధిని పోగుచేయడంలో ఉన్న ఉద్దేశం ఏంటి?" అని ఖర్గే ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీతో పాటు, స్వదేశీ, విదేశీ విరాళాలు కూడా ఈ నిధికి సమకూరాయని ఖర్గే వెల్లడించారు.

# ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

**ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం**

**- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎస్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# నా బిడ్డ వ్యాఖ్యలకు నేను బాధ్యురాలిని కాదు

### - కొండా సుస్మిత వ్యవహారంపై కొండా సురేఖ క్లారిటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారంరేపుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నేతలపై సుస్మిత తీవ్ర ఆరోపణలు చేయడంతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖ కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై సురేఖ స్పందిస్తూ తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల వ్యక్తిగత అభిప్రాయాలకు ప్రజాప్రతినిధిని బాధ్యురాలిగా చేయడం సరికాదని పేర్కొంటూ నోటీసును ఉపసంహరించుకోవాలని కొండా సురేఖ కోరారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులపై స్పందించిన మంత్రి కొండా సురేఖ తన కుమార్తె ఒక స్వతంత్ర వ్యక్తిగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు. కుటుంబం కారణంగా ఆమె వ్యక్తిగత, రాజకీయ అభిప్రాయాలకు తనను బాధ్యురాలిగా చేయడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేశారు. తన ప్రమేయం లేని అంశంపై వివరణ కోరడం సముచితం కాదని సహజ న్యాయ స్ఫూర్తికి కూడా ఇది విరుద్ధమని పేర్కొంటూ షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని కోరారు.కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా వరంగల్ జిల్లా గీసుకొండలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి అయిన తర్వాత కళ్లు నెత్తికెక్కాయని వ్యాఖ్యానించారు. టీడీపీ నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్రంలో పచ్చ కాంగ్రెస్ మాత్రమే నడుస్తోందని ఆరోపించారు. క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తాను పోటీ చేస్తానని కొండా సుస్మిత కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ టికెట్ దక్కకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ల విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం కాంగ్రెస్ అధిష్ఠానానికే ఉంటుందని ముఖ్యమంత్రి ఒక్కడే అభ్యర్థులను ప్రకటించడం సరికాదని ఆమె వ్యాఖ్యానించారు. పరకాలలో మళ్లీ రేవూరి ప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చిన నేపథ్యంలో కొండా సుస్మిత ఈ వ్యాఖ్యలు చేశారు.

# మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్

**- సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదన**



చెన్నై (ప్రశ్న న్యూస్) దక్షిణ భారతదేశంలోని మూడు కీలక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులను కలుపుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. మూడు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన పారిశ్రామిక కేంద్రాలైన అమరావతి, బెంగళూరు, చెన్నైలను అనుసంధానించే ఈ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టును చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తన నియోజకవర్గమైన కుప్పం మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మూడు నగరాలు ఇప్పటికే పారిశ్రామికంగా, సాంకేతికంగా గణనీయమైన అభివృద్ధి సాధించాయని, వాటి మధ్య హై-స్పీడ్ రైలు మార్గం ఏర్పాటు చేస్తే రవాణా వ్యవస్థ బలోపేతమై ఆర్థికాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, ఇది దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమావేశంలో, దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు మరో ముఖ్యమైన సూచన చేశారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం వంటి వాటిని.. ఉత్తర భారతదేశంలోని వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలన్న జాతీయ లక్ష్యంలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా 31 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్లు, తమిళనాడు 2.6 ట్రిలియన్ డాలర్లు, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగే లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ఆయన వివరించారు. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

# కాళేశ్వరం, ధరణి, మెడికల్ కాలేజీల్లో దోచుకున్నారు

**- హరీష్ రావు వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి కౌంటర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో 22ఏ నిషేధిత భూముల వ్యవహారం మరోసారి హీట్ పెంచింది. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.కమీషన్లు, అవినీతి గురించి హరీశ్ రావు మాట్లాడటం చూస్తుంటే హంతకుడే సంతాపం తెలిపినట్లు ఉంది అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీగా కూడా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఫెయిల్ అయిందని ఆరోపించారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రివర్గం నుంచి తొలగించాలని హరీష్ రావు డిమాండ్చేసిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్ష హోదాలో ఉండి పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల్లో ఆందోళన రేకెత్తించడం తప్ప బీఆర్ఎస్ వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని విమర్శించారు.కమీషన్లు, అవినీతి గురించి హరీశ్ రావు మాట్లాడుతుంటే బీఆర్ఎస్ నేతలు కూడా నవ్వుకుంటున్నారని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఆ పార్టీకి చెందిన నాయకులు, మరీ ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, కల్వకుంట్ల కవిత గతంలో చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు మర్చిపోవద్దని కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో హరీశ్ రావు ఎలా సంపాదించారో, ఏ వ్యాపారం చేశారో, తక్కువ సమయంలో భారీగా ఆర్థికంగా ఎదగడానికి కారణమేంటో ప్రజలకు వివరించాలని పొంగులేటి ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి పోర్టల్, మెడికల్ కాలేజీల వరకు బీఆర్ఎస్ హయాంలో భారీ అవినీతి జరిగిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. తమ పాలనలో కమీషన్ల మీద పనులు జరిగాయని అదే విధానం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతుందని బీఆర్ఎస్ భావించడం కేవలం భ్రమేనని అన్నారు. మీ భ్రమను ప్రజలపై రుద్దకండి అంటూ హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలకు మంత్రి పొంగులేటి హితవు పలికారు. గతంలో అధికారంలో ఉండి పరిపాలనలో విఫలమైన బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నిర్మాణాత్మకంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం 22ఏ నిషేధిత భూముల అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కారణమైంది.ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీశ్ రావు ఆరోపిస్తుండగా.. ఆ ఆరోపణలను మంత్రి పొంగులేటి తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ గత పాలనను టార్గెట్ చేసి విమర్శలు చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతుండగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.

# రోడ్డుపై సూచిక బోర్డు.. అధికారుల నిర్లక్ష్యం

### వారం రోజులుగా రోడ్డుపైనే.. పట్టించుకోని మున్సిపల్ అధికారులు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న ఘటన ఇది. రోడ్డుపై చెత్త వేస్తే 5000 ? జరిమానా సూచిక బోర్డు ప్రజలకు దిశానిర్దేశం చేయాల్సిన సూచిక బోర్డు ఏకంగా రోడ్డుపై పడిపోయి వారం రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గజ్వేల్ తూప్రాన్ ప్రధాన రహదారి పక్కనే సూచిక బోర్డు కిందపడి ఉండటంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు దాని నిర్వహణను మాత్రం గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

వారం రోజులుగా బోర్డు రోడ్డుపై పడి ఉన్నా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి బోర్డును తొలగించి, మరమ్మతులు చేసి యథాస్థానంలో ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లోనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588